Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 128 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 మే 2023 మంగళవారం పేజీలు : 4

### కనిష్ఠాల నుంచి కోలుకున్నా.. నష్టాల్లోనే ముగిసిన మార్కెట్లు!

ముంబయి: అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల మధ్య ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు చివరకు కనిష్ఠాల నుంచి కోలుకున్నాయి. కానీ, లాభాల్లోకి మాత్రం రాలేకపోయాయి. మిశ్రమ కార్పొరేట్ ఫలితాలు, ఫెడ్ వడ్డీరేట్ల పెంపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు ఇంట్రాడేలో మదుపర్లను కలవరపెట్టాయి. చైనాలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో విధిస్తున్న కఠిన లాక్‌డౌన్‌లు కూడా సెంటిమెంటు ను దెబ్బతీశాయి. అయితే, అమెరికా ఫ్యూచర్స్ ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతుండడంతో సూచీలకు చివర్లో కాస్త మద్దతు దొరికింది. మరోవైపు గత కొన్ని రోజుల భారీ నష్టాల నేపథ్యం లో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు.



# నానాటికీ దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థ

## మోదీ పాలన.. వృద్ధిరేటు 4.4 శాతమే

### క్యూ3లో పడిపోయిన కన్స్యూమర్ డిమాండ్ - మైనస్ 1.1 శాతంగా తయారీ రంగ ఉత్పాదకత

దేశ ఆర్థికరంగం రోజురోజుకూ దిగజారుతున్నది. కేంద్ర ప్రభుత్వ పనితీరు అధ్వానంగా ఉన్నదని స్పష్టంచేస్తూ ఆర్థిక రంగం పతనం దిశగా పయనిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గణాంకాలే మోదీ సర్కారు పనితీరుకు అద్దం పడుతున్నాయి. భారతదేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మలుస్తున్నామని ఒకవైపు మోదీ సర్కారు ఊదరగొడుతుండగా, వాస్తవంగా మాత్రం మన ఆర్థిక వ్యవస్థ నేల చూపులు చూస్తున్నది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి చెందిన ఆర్థిక గణాంకాలను కేంద్రం విడుదల చేసింది. వరుసగా రెండో త్రైమాసికంలో కూడా స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు తగ్గిపోయింది. జూన్-ఆగస్టు క్వార్టర్‌లో జీడీపీ వృద్ధిరేటు 6.3 శాతం ఉండగా, అక్టోబర్- డిసెంబర్ క్వార్టర్లో 4.4 శాతానికి పడిపోయింది. దేశంలో తయారీ రంగం ఏటా 1.1 శాతం కుంగిపోతున్నదని ఈ డాటా తేటతెల్లం చేసింది. అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, దానిని అదుపు చేసేందుకు నిరంతరం వడ్డీ రేట్లు పెంచుతుండటం తయారీరంగం పనితీరును దెబ్బతీస్తున్నాయని నిపుణులు అంటున్నారు. వీటికి తోడు మార్కెట్లో కొనుగోలు శక్తి పడిపోవటం, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వచ్చే త్రైమాసికంలోనూ జీడీపీ వృద్ధిరేటు తగ్గే అవకాశం ఉన్నదని రిసర్జెంట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతిప్రకాశ్ గడియా అభిప్రాయపడ్డారు. ప్రజల జీవన ప్రమాణానికి నిదర్శనంగా నిలిచే తలసరి ఆదాయ గణాంకాలు కూడా నిరాశాజనకంగానే ఉన్నాయి. ప్రస్తుత ధరల ప్రకారం 2020-21లో తలసరి ఆదాయం లేదా నికర జాతీయ తలసరి ఆదాయాన్ని రూ. 1,27, 065గా, 2021-22లో రూ. 1,48,524గా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. అయితే 2021-22 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ. 3,05,389. దేశ తలసరి ఆదా యం కంటే రాష్ట్రంలోనే రెట్టింపుకంటే ఎక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం.



### అమెరికాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు..
### పాల్గొననున్న రాహుల్‌గాంధీ

హైదరాబాద్: అమెరికాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు అక్కడ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. అమెరికాలో జరగనున్న ఈ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో రాహుల్‌గాంధీ పాల్గొననున్నారు. జూన్ 2న వాషింగ్టన్‌లో తెలంగాణ ఫార్మేషన్ డే కార్యక్రమాన్ని ఐఓసీ నిర్వహించనుంది. అలాగే జూన్ 4న అమెరికాలోని జాకబ్ జవిడ్ సెంటర్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ మీటింగ్ జరగనుంది. ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీతో పాటు తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్యతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు.

## ఒక్క ఫొటో అనేక కామెంట్లు.. మోడీ పై నెటిజన్ల రుసరుస!



ప్రధాని నరేంద్ర మోడీ పై నెటిజన్లు రుసరుసలాడుతున్నారు. “ఎంత తేడా.. ఎంత తేడా!” అంటూ బుగ్గలు నొక్కుకుంటున్నారు. తాజాగా ఢిల్లీలో 12 కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భారత నూతన పార్లమెంటును ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్నిరెండు దశలుగా నిర్వహించారు. ఒకటి.. పూజలు రాజదండాన్ని ప్రతిష్టించడం.. పార్లమెంటు ను ప్రారంభించడం.. రెండు దేశ ప్రజల ను ఉద్దేశించి మోడీ ప్రసంగించడం. అయితే.. తొలి దశ కార్యక్రమానికి ఎంపీలను ఎవరినీ పిలవలేదు. రెండో దశ కార్యక్రమానికి(ఎంపీలను కూర్చోబెట్టి.. ప్రధాని ప్రసంగించే కార్యక్రమం) మాత్రం అందరినీ ఆహ్వానించారు. ఇదిలావుంటే.. ఈ సందర్భంగా మోడీ.. తమిళనాడు కు చెందిన కొందరు సాధువులతో మోడీ గ్రూప్ ఫొటో దిగారు. దీనిని ఆయన ట్వీట్ కూడా చేశారు. అయితే దీనిపైనే నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ ఫొటో కు పైన.. మరో ఫొటో పెట్టారు. గతంలో ప్రస్తుతం ఉన్న పార్లమెంటు ను ప్రారంభించిన సమయంలో అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ తీసుకున్న గ్రూప్ ఫొటో. ఈ ఫొటోలో ఎక్కడా సన్యాసులు.. మఠాధిపతులు కనిపించరు. కానీ. అప్పటి కేంద్ర మంత్రులు.. ఉక్కుమనిషి పటేల్ వంటి మేధావులు ఉన్నారు. ఈ రెండు ఫొటోలను జత కలిపి.. నెటిజన్లు మోడీ పై సటైర్లు వేస్తున్నారు. ఇక ఇదే పొటోను ఉటంకిస్తూ.. మరికొందరు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పుల్వామా లో CRPF జవాన్ల ను ఏయిర్ లిఫ్ట్ చేయడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించిందని.. దీంతో అక్కడ జవాన్లప్రాణాలు కోల్పోయారని వ్యాఖ్యానించారు.

ఇదే విషయాన్ని ఇటీవల జమ్ము కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కూడ వ్యాఖ్యానించారు. అయితే.. తాజాగా పార్లమెంటు నూతన భవనం ప్రారంభంలో మాత్రం.. స్వయం ప్రకటిత అర్చకులకు ప్రత్యేక విమాన సదుపాయం కల్పించి ఢిల్లీ కి పిలిపించడం ప్రభుత్వ ప్రాధాన్యతలు దేనికో అర్థం అవుతోందని అంటున్నారు. ఈ సందర్భంగా మోడీ హిందూత్వ రాజకీయం పై నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు...



# మ్యాజిక్ ఫిగర్ 40

## తెలంగాణా బీజేపీ సొంతమైనట్లేనా...?

హైదరాబాద్ : బీజేపీ తెలంగాణా మీద గట్టిగానే గురి పెట్టింది. రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా బడా నాయకులుజాతీయ నాయకులు తెలంగాణాలో టూర్లు చేస్తారు అని తెలుస్తోంది. ముఖ్యంగా దేశంలో రాష్ట్రపతి ఎన్నికలు ముగిసి కొత్త రాష్ట్రపతి ప్రమాణం చేశాక బీజేపీ తెలంగాణా రాజకీయాన్ని మరింతగా రక్తి కట్టిస్తుంది అని అంటున్నారు. బీజేపీకి తెలంగాణా గెలుపు ఇపుడు చాలా అవసరం. తెలంగాణాలో గెలుపు ద్వారా ఏపీలో ఎంట్రీకి అతి పెద్ద దారి కనిపిస్తుంది. ఆ మీదట తమిళనాడులో కూడా కాషాయ పాగా వేయడానికి అది ఎంతగానో ఉపయోగపడుతుంది. దాంతో దక్షిణాదిన చక్రాన్ని తిప్పడానికి తెలంగాణా బీజేపీకి ఆశాకిరణమని చెబుతున్నారు. అలా ఎక్కడ తమకు కాస్తా అనుకూల పరిస్థితి ఉందో అక్కడే ఫుల్ ఫోకస్ పెట్టాలన్నది బీజేపీ ఆలోచన. అదే అజెండా కూడా. ఇక బీజేపీకి తెలంగాణాలో అధికారం దక్కాలీ అంటే 60 సీట్లు రావాలి. ఎందుకంటే 119 ఎమ్మెల్యే సీట్లు ఉన్నాయి. మరి తెలంగాణాలో 2018 ఎన్నికల్లో కేవలం ఒకే ఒక్క సీటు దక్కిన బీజేపీ ఇంతలా ఎలా సాధించగలదు అంటే దానికి బీజేపీ లెక్కలు బీజేపీకి ఉన్నాయని అంటున్నారు. తెలంగాణాలో బీజేపీ బలం 2019 ఎంపీ ఎన్నికల నాటికి బాగా పెరిగింది. ఏకంగా నాలుగు ఎంపీ సీట్లను తన ఖాతాలో వేసుకుంది. ఆ తరువాత జరిగిన నాలుగు ఉప ఎనికల్లో దుబ్బాక హుజూర్ బాద్ లని గెలిచి అసెంబ్లీలో బీజేపీ తన బలాన్ని మూడు సీట్లకు పెంచుకుంది. ఈ రోజు 119 మంది ఉన్న అసెంబ్లీలో బీజేపీకి ఉన్నవి మూడు మరి ఎక్కడ మ్యాజిక్ ఫిగర్ 60 సీట్లు ఎక్కడ మూడు సీట్లు. అయితే బీజేపీకి బలం గత కొంతకాలంగా పెరిగింది అని అంటున్నారు కదా రియల్ గా ఆ పార్టీ బలం ఎంత అని ఆరా తీస్తే గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ చూస్తే బీజేపీకి 2023 ఎన్నికల్లో గట్టిగా కష్టపడితే పది నుంచి పదిహేను సీట్లు వచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. అంటే నిజంగా ఇది బీజేపీ మెచ్చతగిన నంబరే. కారణం 2018 ఎన్నికల్లో ఒక సీటు ఉన్న బీజేపీ అయిదేళ్ళలో పదిహేను సీట్లు అంటే బాలం అన్ని రెట్లు పెరిగినట్లుగా చూడాలి. కానీ ఇది ఏ మాత్రం సరిపోదు అని బీజేపీ భావిస్తోంది. ఈ బలాన్ని రెట్టింపు చేసుకోవాలని చూస్తోంది. అంటే 2023 ఎన్నికలు జరిగే నాటికి ముప్పయి అయిదు నుంచి నలభై సీట్లు సాధించాలని బీజేపీ టార్గెట్ పెట్టుకుంది అంటున్నారు. అంటే మొత్తం అసెంబ్లీ సీట్లలో మూడవ వంతు అన్న మాట. ఈ నంబర్ కనుక బీజేపీ రీచ్ అయితే కచ్చితంగా తెలంగాణా బీజేపీ సొంతం అవుతుంది. అదెలా అంటే ఆ మీదట జరిగే పరిణామాలను తెలంగాణా రాజకీయ తెర మీద చూడాల్సిందే అంటున్నారు. నలభై సీట్లు సాధించిన బీజేపీ అరవై సీట్లకు అంటే మరో ఇరవై సీట్లను సాధించడం అంటే దానికి ఎన్నోరాజకీయ ఉపాయాలు ఉన్నాయని అంటున్నారు. మహారాష్ట్రలో బీజేపీ సర్కార్ ఎలా ఏర్పడింది. అలాగే కర్నాటక మధ్యప్రదేశ్ లలో బీజేపీ ఎలా ప్రభుత్వాలను స్థాపించింది అన్నది కనుక ఆలోచిస్తే బీజేపీ చెప్పుకోతగిన సీట్లు కనుక తెలంగాణాలో సాధిస్తే మాత్రం ఒక సర్కార్ ఏర్పాటు కొరకు ఆట ఆడించేయడం ఖాయమనే అంటున్నారు. అధికారం కోసం అందరూ 60 సీట్లను టార్గెట్ చేస్తూంటే బీజేపీ మాత్రం నలభై సీట్లు వస్తే చాలు మాదే తెలంగాణా అని చెబుతోందిట. ఈ నేపథ్యంలో బీజేపీ నలభై సీట్లను గెలుచుకునేందుకు టీయారెస్ మీదనే గురి పెడుతోంది. ఆ పార్టీలో అసంతృప్తివాదులను తమ వైపునకు తిప్పుకుని వచ్చే ఎన్నికలల్లో వారికే టికెట్లు ఇస్తే వారి అర్ధబలానికి అంగబలానికి తమ బలాన్ని జోడించి నంబర్ 40 ని రీచ్ కావడం సులువు అని ఆలోచిస్తోందని అంటున్నారు.

# సంపాదకీయం

## భారత్ కి కన్ను గీటుతున్న పుతిన్ బైడెన్ ఏమంటారో...?

ప్రపంచం ఒక కుగ్రామం అయిన వేళ ఏ ఇద్దరు మధ్య యుద్ధం వచ్చినా మొత్తం విశ్వం మీద ప్రభావం పడుతుంది. అదే సమయంలో ఈ ఇద్దరికీ చెరో వైపునా లాగేసే వారూ ఉంటారు. ఎటూ కాకుండా తటస్థంగా ఉంటూ మన వ్యక్తిత్వాన్ని నిలుపుకుందామనుకుంటే కుదిరే రోజులు కావు. అయినా భారత్ కి అందరూ కావాలి అన్నదే నినాదం. శాంతి మన మంత్రం. అయితే అర్ధం చేసుకునే వారు ఉన్నారా అన్నదే ఇక్కడ చర్చ. ఇక రష్యా ఉక్రెయిన్ మీద పడి యుద్ధం చేయడాన్ని అంతా తప్పుపడుతున్నారు. భారత్ కూడా యుద్ధం వద్దు అనే చెబుతోంది. రెండు దేశాలూ కూర్చుని మాట్లాడుకోవాలని కూడా కోరుతోంది. అయితే ఈ విషయంలో పుతిన్ తో ఫోన్ లో ప్రధాని మోదీ మాట్లాడారు అలాగే ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్ స్కీతో కూడా చర్చించారు. అయినా ఈ యుద్ధం ఆగడం లేదు. నాటో దేశాలతో పాటు అమెరికా పెద్దన్న తెర వెనక ఉన్నారని రష్యా అనుమానం. దాన్ని నిజం చేసేలా ఉక్రెయిన్ రష్యాల మధ్య చర్చలు దోబూచులాట ఆడుతున్నాయి. యుద్ధం మాత్రమే నికరంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ అయితే తనది న్యూట్రల్ రోల్ అని చెప్పేసింది. ఐక్య రాజ్యసమితిలో కూడా ఎటూ ఓటేయకుండా తటస్థ వైఖరి అవలంబించింది. దాంతో అమెరికా ప్రెసిడెంట్ బైడెన్ కి కోపం వచ్చిందని అప్పట్లో ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా ఇపుడు రష్యా భారత్ కి ఉన్న ఉదుటన ఒక బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ యుద్ధం వల్ల ప్రపంచంలో చమురు ధరలు విపరీతంగా పెరుగుతాయన్న ఆందోళన ఉంది. అలాగే భారత్ లో ఆ భయాలు ఉన్నాయి. అయితే రష్యా ప్రెసిడెంట్ పుతిన్ మాత్రం భారత్ పట్ల ప్రేమ చూపిస్తూ కారు చౌకగా చమురుని ఇస్తామని ఆఫర్ ఇచ్చేశారని ప్రచారం సాగుతోంది. రష్యా డిప్యూటీ ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ అయితే దీని మీద కేంద్రంలో డైరెక్ట్ గా మాట్లాడారని తెలుస్తోంది. ఒక విధంగా ఇది భారత్ పరంగా చూస్తే సూపర్ ఆఫర్. భారత్ ఆర్థిక వ్యవస్థ మొత్తానికి ఊపిరి ఇచ్చే పరిణామం. అయితే ఇక్కడే లోతుగా కేంద్రం ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది అంటున్నారు. ఎందుకంటే అమెరికా సహా యూరోపియన్ దేశాలు భారత్ పట్ల ఎలా వ్యవహరిస్తాయి అన్న మీమాంస అయితే ఉంది. ఇక రష్యా ఆఫర్ చూస్తే క్రూడాయిల్ నిల్వలు పెద్ద ఎత్తున అక్కడ పేరుకుపోతున్నాయి. మిగిలిన ప్రపంచంలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 139 డాలర్లకు చేరగా రష్యా మాత్రం భారత్ కే మా ఆఫర్ అని ఊరిస్తోంది. అయితే ఇది అంతర్జాతీయ పరిణామాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సిన అంశమని అంటున్నారు. ఏకపక్షంగా రష్యా ఆఫర్ కి తలొగ్గితే మిగిలిన ప్రపంచానికి భారత్ దూరం అయ్యే ప్రమాదం ఉంది. ఏది ఏమైనా రష్యా బంపర్ ఆఫర్ మాత్రం ఊరించే విధంగానే ఉంది.

# ముందడుగు పడేనా..!



మహబూబాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ చేపడుతామని 2018 సార్వత్రిక ఎన్నికల సమయంలో మహబూబాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్న మాట.. ఆ విధంగానే పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇందుకోసం రెండు రోజుల కిందట జిందాల్ సంస్థకు చెందిన జియాలజిస్ట్‌లు, జిల్లా మైనింగ్ అధికారులు కలిసి బయ్యారంలో ఇనుప ఖనిజం ఉన్న గుట్టలను పరిశీలించారు. దీంతో పరిశ్రమపై జిల్లా ప్రజల్లో మరోమారు చిగురించాయి. జియాలజిస్టుల పరిశీలనతోనే ఆగకుండా పరిశ్రమ ఏర్పాటుకు ఈసారైనా ముందడుగు పడాలంటూ జిల్లావాసులు ఆశిస్తున్నారు. ఉక్కు పరిశ్రమ నెలకొల్పితే ప్రత్యక్షంగా 5వేలు, పరోక్షంగా మరో 20 వేల మందికి ఉపాధి లభించి జిల్లా పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ప్రముఖ పారిశ్రామిక కంపెనీ జిందాల్ సంస్థ ప్రతినిధులతో జనవరి 12న ముంబైలో కలిసి పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చూపిన చొరవ వల్లనే బయ్యారం, మెట్లతిమ్మాపురం, పందిపంపుల, ఇర్సులాపురం గ్రామాల్లోని అడవి ప్రాంతాల్లోని ఇనుప ఖనిజం ఉన్న గుట్టలను రెండు రోజుల పాటు పరిశీలించారు. గుట్టల పైకి ఎక్కి ఇనుప రాళ్లు ఎంత విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయని పరిశీలించారు. ఆయా గుట్టలపై ఉన్న కొన్ని రాళ్లను తమ వెంట తీసుకెళ్లారు. ఆ జియాలజిస్టులు తమ కంపెనీ ప్రయోగశాలలో అందులో ఇనుము నాణ్యత ఎంత పరిమాణంలో ఉందనే విషయాన్ని పరిశీలించనున్నారు. అనంతరం ఆ సంస్థకు చెందిన మరో బృందం గుట్టల వద్దకు వచ్చి లోతైన పరిశీలన చేసిన అనంతరం పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన వసతులును చూసుకొని ఒక నిర్ణయానికి వస్తారంటూ జిల్లా మైనింగ్ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

### గతం పునరావృతం కావొద్దు

పునర్విభజన చట్టం 2014లో ఇచ్చిన హామీకి లోబడి బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రారంభించి తొమ్మిదేళ్లు గడిచిపోయింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెయిల్ సైతం 2014లో పరిశ్రమ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. 2014మే 21, 22 తేదీల్లో బయ్యారం ఇనుప ఖనిజంపై పరిశీలన కొనసాగించింది. ఈనేపథ్యంలోనే ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజ లభ్యత, నాణ్యతపై జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ), తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైనింగ్(టీడీజీఎం) సంయుక్తంగా పలుమార్లు సర్వే నిర్వహించాయి. ఈ సర్వే నివేదికల ఆధారంగా సెయిల్ మరోమారు కార్యాచరణకు పూనుకుంది. సెయిల్ సుముఖతతో ఖనిజనిల్వలు, నాణ్యతపై సింగరేణి ఆధ్వర్యంలో సమగ్రమైన అన్వేషణ ప్రారంభించారు. బయ్యారం, గూడూరు, గార్ల, నేలకొండపల్లి ప్రాంతాల్లో మ్యాపింగ్, డ్రిల్లింగ్‌తో సర్వే నిర్వహించి నివేదిక అందజేశారు. ఈ క్రమంలో 2015లో కేంద్రప్రభుత్వం ఒకఉన్నతస్థాయి కార్యదళం (టాస్క్‌ఫోర్స్ కమిటీని) ఏర్పాటు చేసింది. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరించిన కేంద్రం సెయిల్ ప్రతినిధులు, తెలంగాణ గనులశాఖ, కేంద్ర ఉక్కుశాఖ అధికారులతో కూడిన మరో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. సర్వేల ప్రకారం ఈ ప్రాంతంలో సుమారు 15342 హెక్టార్లలో ఇనుపఖనిజ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయని స్పష్టమౌతుంది. దీనిప్రకారం ఈ ఖనిజం విలువ సుమారు రూ.16 లక్షల కోట్లు ఉంటుందని భారత గనుల బ్యూరో(ఐబీఎం) అంచనా వేసింది. ఇక్కడ ఇనుప ఖనిజంలో 60 నుంచి 65 శాతం వరకు ఇనుముదాతువు ఉన్నట్లు వెల్లడైంది. కాని చివరకు ఎన్నో సర్వేలు నిర్వహించిన కేంద్రం చివరకు చేతులెత్తేసినట్లుగా చేసింది. తాజాగా గురు, శుక్రవారం జిందాల్ కంపెనీ జియాలజిస్టులు, జిల్లా మైనింగ్ అధికారుల బృందం ఇనుప గుట్టల వద్ద చేసిన పరిశీలన కూడా గతంలో మాదిరిగా కావొద్దంటూ ప్రజలు భావిస్తున్నారు.

### అన్ని వనరులున్నా

ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు ఇక్కడ అన్నివనరులు ఉన్నట్లు అనేక కమిటీలు తేల్చాయి. పరిశ్రమకు అవసరమైన ముడి ఖనిజం, స్థలం, విద్యుత్ సరఫరా, బొగ్గు డోలమైట్ సరఫరా, రైల్వేలైను, నీరు, ఇతర వనరులు సమృద్ధిగా ఉన్నాయి. ఈ మేరకు 2018లో మండలంలోని ధర్మాపురంలో పరిశ్రమకు అవసరమైన భూమిని కమిటీ పరిశీలించింది. నీటి లభ్యతపై ఆరా తీసింది. దీంతోపాటు ఉక్కు కర్మాగారం ఏర్పాటులో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్‌ఎండీసీ) భాగస్వామిగా చేరాలని అధ్యయన కమిటీ కోరింది. అంతేకాదు పరిశ్రమకు అవసరమైన అదనపు ఖనిజాన్ని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి లింకేజీ తీసుకొని పరిశ్రమకు అందించవచ్చని అంచనా వేశారు. ఇందుకు అవసరమైన రైలు మార్గం నిర్మాణానికి అయ్యే వ్యయంలో సగం భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది.

# బల్దియా స్థలాలకు ఇదేం రాత

కామారెడ్డి : బల్దియా స్థలాలు కబ్జాకోరల్లో చిక్కుకున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పాటయ్యాక భూముల ధరలు పెరిగాయి. కబ్జాకోరులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా వదలడం లేదు. అనేక ప్రైవేటు భూములకు రెండు రిజిస్ట్రేషన్లు బయటపడుతున్నాయి. ఇక పురపాలక స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అధికారులకే స్పష్టత కరవైంది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ బల్దియా స్థలాలను పరిరక్షించాలని సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లారు.

### వివిధ అవసరాలకు

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బడులు, సామాజిక సంఘాలు, ఆలయాలకు బల్దియా స్థలాలను కేటాయించారు. గత పాలకవర్గ హయాంలో తీర్మానాలు చేస్తూ అప్పణంగా వివిధ అవసరాలకు అప్పగించేశారు. ఆరేళ్ల క్రితం అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ స్థలాలను భవిష్యత్ అవసరాలకు వినియోగించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో యంత్రాంగం కేటాయింపులను ఆపేసింది.

### వివరాలు గల్లంతు

పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు పాతారు. ఎంత విస్తీర్ణంలో



ఉంది.. సర్వే నంబరు.. తదితర వివరాలను దానిపై రాశారు. ప్రస్తుతం అనేక చోట్ల ఆ రాతలు మాయమయ్యాయి. కొన్నిచోట్ల బోర్డులనే తొలగించారు. తిరిగి కొత్తవి ఏర్పాటు చేయాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.

### కంచె లేక సమస్య

60 శాతం స్థలాలకు కంచె లేదు. అనేక ప్రాంతాల్లో వివాదాస్పదమవుతున్నాయి. ఏళ్లనాటి లేఅవుట్ ప్లాట్లలో 10శాతం వదిలిన స్థలాల విషయంలో సమస్య నెలకొంది. కేటాయింపులో జరిగిన తప్పిదం కారణంగా అసలు యజమాని స్థలం ఎక్కడుందో స్పష్టత కరవైంది. ఇలాంటి ఘటనలు జిల్లాకేంద్రంలో అనేక ప్రాంతాల్లో వెలుగుచూస్తున్నాయి. ఇంజినీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక శాఖల మధ్య సమన్వయం కొరవడింది.

ఇది జయశంకర్‌కాలనీలోని పురపాలక స్థలం. ఇక్కడ గజం విలువ రూ.25 వేలపైనే ఉంటుంది. దీని పరిరక్షణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం కంచె వేయలేదు. చుట్టూ నివాస గృహాలు ఏర్పాటయ్యాయి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా స్థలం పరిరక్షించకుంటే పరులపాలయ్యే ప్రమాదం ఉంది.

ఇది జిల్లాకేంద్రంలోని భవానీనగర్ నుంచి సైలాన్‌బాబాకాలనీ వెళ్లే ప్రాంతంలోని పురపాలక స్థలం. ఇక్కడ గజం విలువ రూ.15 వేలు పైనే పలుకుతోంది. బల్దియా స్థలమని బోర్డు పెట్టినా దానిపై వివరాలు పోయాయి. ఇక్కడ ఓ నీళ్ల ట్యాంకు నిర్మించారు. మిగిలిన స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అతీగతీ లేకుండా పోతోంది.

### సర్వే చేస్తాం– దేవేందర్, కమిషనర్

జిల్లా కేంద్రంలోని పురపాలక స్థలాల పరిరక్షణకు సర్వే చేపడతాం. సమగ్ర వివరాలను బోర్డులపై రాసేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో చర్చిస్తాం. కబ్జాలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవు.

# పర్యవేక్షణ లేక తగ్గుతున్న ప్రసవాలు




వరంగల్ : నర్సంపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉదాసీనత.. కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ.. మహిళా వైద్యురాళ్ల పంచాయతీ కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాదికి పైగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది మధ్య గొడవలు జరగడం సాధారణమైంది. ఆసుపత్రి వరకే పరిమితమైన పంచాయతీ ఇటీవల రచ్చకెక్కింది. మహిళా వైద్యురాళ్ల గలాటాపై జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) అశ్విని తానాజీ వాకడే విచారణ నిర్వహించారు. గతంలో ఇద్దరు మహిళా వైద్యులున్నప్పుడు జరిగిన కాన్పుల కంటే ప్రస్తుతం ముగ్గురు మహిళా వైద్యురాళ్లున్నా తగ్గడం గమనార్హం.

ఒకప్పుడు మొదటి స్థానంజిల్లాల పునర్విభజనకు ముందు ఇక్కడి ఆసుపత్రిలో ఇద్దరు మహిళా వైద్య నిపుణులున్నప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏరియా ఆసుపత్రులతో పోటీపడి వైద్యం అందించేవారు. ప్రసవాల్లో అప్పట్లో నర్సంపేట ఆసుపత్రి మొదటి స్థానం పొందగా అప్పటి కలెక్టర్ వాకాటి కరుణ ఆసుపత్రి వైద్యులను అభినందించారు. తర్వాత ఆసుపత్రికి కాన్పుల కోసం వచ్చే రోగుల సంఖ్య పెరగడంతో ఉన్నతాధికారులు వైద్యుల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం ముగ్గురు మహిళా వైద్యురాళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇద్దరు రెగ్యులర్ వైద్యులు కాగా ఒకరు ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్నారు.

### సూపరింటెండెంట్ ఎదుటే గలాటా

ముగ్గురు మహిళా వైద్యురాళ్ల మధ్య తరుచూ ఏదో ఒక గొడవ జరుగుతోంది. ఆసుపత్రిలో జరిగే సంఘటనలు కుటుంబ సభ్యులకు చెప్పి వారిని ఆసుపత్రికి తీసుకొచ్చి అడిగిస్తుండటంతో తోటి వైద్యులు, సిబ్బంది, రోగులకు కొంత అసౌకర్యం కలుగుతోంది. సూపరింటెండెంట్ గదికెళ్లి పంచాయతీపై నిలదీసినట్లు సమాచారం. ఓ వైద్యురాలు తోటి వైద్యులను, సిబ్బందిని రాయలేని పదాలతో దూషిస్తోందనే ప్రచారం సాగుతోంది. ప్రాథమిక స్థాయిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కట్టడి చేయనందునే పరిస్థితి చేయిదాటిందని కొందరు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి డ్యూటీ సమయంలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేసినట్లు తెలిసినా తీసుకున్న చర్యలు శూన్యం. ఉన్నతాధికారులు చొరవజూపి పరిస్థితిని చక్కదిద్దకుంటే ప్రభుత్వ వైద్యానికి ప్రజలు దూరమయ్యే అవకాశముంది.

# అందినకాడికి దండుకోవడమే..

కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నాన్‌జ్యుడీషియల్ పేపర్ల విక్రయాలు సాగుతున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు, ఇతర రుణాలు, స్థిరాస్తి ఒప్పంద పత్రాలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అఫిడవిట్ తయారీ తదితర అవసరాలకు వాటి వినియోగం ఇటీవల బాగా పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువగా రూ.20, రూ.50, రూ.100 విలువైన స్టాంపు పేపర్ల అమ్మకాలు సాగుతున్నాయి. వెండర్లు ఒక్కోస్టాంపు పేపరును రెండు రెట్లకు అమ్ముతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చే 5 శాతం కమీషన్‌తోనే విక్రయాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అందినకాడికి దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### అసలు ధరకు అదనంగానే..

ఉమ్మడి జిల్లాల్లో 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, 150కి పైగా స్టాంపు వెండర్లు ఉన్నారు. వీరు తమ పరిధిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇండెంట్ పెట్టి స్టాంపు పేపర్లు కొనుగోలు చేస్తుంటారు. ప్రభుత్వం వీటి విలువ ఆధారంగా విక్రయాలపై 5 శాతం కమీషన్‌ను కొనుగోలు సమయంలోనే చెల్లిస్తోంది. కానీ, అసలు ధరకు అదనంగా వసూలు చేస్తుండటం గమనార్హం.

### అధికారులు దృష్టి పెట్టాలి

అధికారులు ఈ అక్రమ వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. 5 శాతం కమీషన్‌పైనే విక్రయించుకొనేలా చర్యలు తీసుకోవాలి. వారే వెండర్లకు కొమ్ముకాస్తుండటంతో మరింత రెచ్చిపోతున్నారు. సామాన్యులకు ప్రభుత్వ ధరకే అందేలా చూడాలి.

### ప్రశ్నిస్తే లేవంటున్నారు..

ఉమ్మడి జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ స్టాంపు పేపర్ల వినియోగం ఎక్కువ. వీటి కోసం వెండర్లను ఆశ్రయిస్తారు. కార్యాలయాలు ఉన్న ప్రాంతాల్లో ఒక్కో స్టాంపు పేపర్ మీద కనిష్ఠంగా 50 శాతం గరిష్ఠంగా 75 శాతం తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం వసూలు చేస్తుండటం గమనార్హం. మార్కెట్లో లభ్యమయ్యే రూ.20 పేపరు కమీషన్‌గా రూ.50 నుంచి రూ.100, రూ.50, రూ.100 విలువైన స్టాంపు పేపర్లపై రూ.100 - 200 వరకు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద లేవని, కావాలంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి నేరుగా తెచ్చుకోవాలని చెబుతున్నారు.

### ఫిర్యాదు చేస్తే చర్యలు–సురేశ్, సబ్ రిజిస్ట్రార్, జాయింట్–2, నిజామాబాద్

వెండర్లు ఎవరూ ఎక్కువ ధరకు విక్రయించొద్దు. పేపర్ విలువ మేరకే డబ్బులు తీసుకోవాలి. ఎవరైనా అధికంగా తీసుకుంటే మా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. కార్యాలయ పనివేళల్లో నేరుగా వచ్చి స్టాంపు పేపర్లు పొందొచ్చు.

# కేంద్రాల్లో బస్తాలు.. రైతులకు తిప్పలు

కామారెడ్డి : ఏటా జిల్లాలో 50 వేల ఎకరాల్లో సెనగ సాగవుతుంది. ఒక్క రెంజల్ మండలంలోనే 8 వేల ఎకరాల్లో పండిస్తారు. ఈ పంట సాగుకు నల్లరేగడి నేలలు అనుకూలం కావడతో గోదావరి పరివాహక ప్రాంతంలో అధికంగా వేస్తారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఎకరానికి పది క్వింటాలు రావాల్సిన దిగుబడులు కేవలం ఐదు క్వింటాలకే పరిమితమైంది. ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెట్టగా.. అవి కూడా రైతుకు మిగలని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పండించిన పంటను అమ్ముకోవడానికి కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు గింజ నాణ్యత పేరిట అధికారులు కొర్రీలు పెడుతుండగా.. లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల నుంచి సకాలంలో ఉత్పత్తులు వెళ్లక రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. రెంజల్‌లో 2,000 బస్తాలు, కందకుర్తిలో 1,500 బస్తాలు తూకం వేసిన బస్తాలు ఉండగా.. తూకం వేయనివి రెట్టింపు ఉంటాయి.

న్యాయం చేస్తాం..ఈ విషయాన్ని రెంజల్ సహకార సంఘం సీఈవో రాము వద్ద ప్రస్తావించగా.. లారీలు రేషన్ బియ్యం తరలించడానికి వెళ్లడంతో కొరత ఏర్పడిందని, ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. నీలా సహకార సంఘం సీఈవో రామ్‌దాస్ మాట్లాడుతూ..గింజ పక్వానికి రాకపోవడంతో కొద్దిమంది రైతుల పంట తిప్పి పంపారని, వాటిని శుద్ధి చేసి మళ్లీ మార్క్‌ఫెడ్‌కు తరలించి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ రైతు పేరు లక్ష్మణ్. నాలుగెకరాల్లో పండించిన సెనగ ఉత్పత్తులను 11 రోజుల కిందట రెంజల్ కొనుగోలు కేంద్రానికి తెచ్చారు. ఎనిమిది రోజుల క్రితం తూకం వేశారు. అప్పటి నుంచి లారీలు రాకపోవడంతో బస్తాలు వెళ్లే వరకు వాటికి కాపలాగా ఉంటున్నారు. రాత్రి వేళల్లో దోమల సమస్య, చలి తీవ్రంగా ఉన్నా.. కాపలాగా ఉండటం తప్పడం లేదని చెబుతున్నారు.

# వానాకాలం సాగుకు ప్రణాళిక సిద్ధం

జనగామ : జిల్లాలో ఈ ఏడాది వానాకాలం పంటల సాగుకు జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాకు అనుకూలమైన, రైతులకు సౌకర్యవంతమైన వరి, పత్తి, కందులు, మొక్కజొన్న, పెసర పంటలకే అధికారులు ప్రణాళికలో ప్రాధాన్యమిచ్చారు. మొత్తం 3,76,625 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. జిల్లాలో ఎర్ర, నల్ల రేగడి నేలలు ఎక్కువగా ఉండటం.. నీటి వనరుల లభ్యత, వాతావరణ పరిస్థితుల ఆధారంగా అధికారులు ప్రణాళికను రూపొందించారు.

జిల్లాలో ప్రధానంగా సాగవుతున్న వరి, పత్తి, కంది, మొక్కజొన్న పంటలకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను దిగుమతి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రోహిణి కార్తె రావడంతో రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల రైతులు వరి నార్లు పోయడం, దుక్కులను సిద్ధం చేసుకోవడం, మరి కొందరు నార్లు



పోసేందుకు, పత్తి విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పత్తి 5,10,000 ప్యాకెట్లు, వరి 57,000 క్వింటాళ్లు, కందులు 440, మొక్కజొన్న 320, వేరుసెనగ 200, పెసర 66 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో) .. యూరియా 43,312, డీఏపీ 18,831, ఎంఓపీ 7,533, కాంప్లెక్స్ 15,065 అవసరమవుతాయని అధికారులు గుర్తించారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలువానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేశాం. అవసరమైన మేరకు దిగుబడి చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రధాన పంటలైన వరి, పత్తి, కంది, మొక్కజొన్నతో పాటు పప్పు ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తాం.వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# ముందస్తు సాగుకు కసరత్తు

కామారెడ్డి: అకాల వర్షాలు, వడగళ్ల వానల బారి నుంచి అన్నదాతలను కాపాడేందుకు సీజన్ల వారీగా పంట కాలాన్ని 3–4 వారాల ముందుకు జరపడమే పరిష్కారమని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ముందస్తు సాగు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను అధికార యంత్రాంగం పరిశీలిస్తోంది. నిజాంసాగర్ ఆయకట్టు అధికంగా ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో ముందస్తు సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన కార్యాచరణను వ్యవసాయశాఖ రూపొందిస్తున్న తీరుపై 'ఈనాడు' కథనం.సాధ్యాసాధ్యాలపై చర్చ

బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే మిగతా ప్రాంతాలకంటే పది – పదిహేను రోజుల ముందుగానే సాగు చేస్తున్నారు. ఎక్కువగా దీర్ఘకాలిక వరి వంగడాలను మాత్రమే ముందస్తుగా సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ నిర్ధారణకు వచ్చింది. స్వల్పకాలిక వరి వంగడాలను సైతం ముందస్తుగానే సాగు చేసే విధంగా ఏర్పాట్లు చేపడితేనే అన్నదాతలకు ప్రయోజనం ఉంటుందనే నిర్ణయానికి వచ్చారు. ముందస్తు సాగు సఫలం కావాలంటే వ్యవసాయశాఖతో పాటు సాగునీటి పారుదల శాఖ, మార్కెటింగ్ శాఖను సమన్వయం చేయాల్సి ఉంది. అన్నదాతలను సైతం ముందస్తు సాగు వైపు మళ్లించాల్సి ఉంటుంది.



సభాపతి చొరవతో..ముందస్తు సాగుపై అన్నదాతలను సమాయత్తం చేసే నిమిత్తం ఈ నెల 27న నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లిలో ఉభయ జిల్లాలు(బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని) రైతులను సమావేశపరిచి అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దీనిని ఏర్పాటు చేయిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోనే మొదటగా నియోజకవర్గంలోని రైతులచే ముందస్తు సాగును చేయించాలనే నిర్ణయానికి వచ్చారు. సదస్సులో రుద్రూర్ వరి పరిశోధన కేంద్రానికి చెందిన వ్యవసాయ, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలతో రైతులకు ముందస్తు సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, నీటిపారుదల, మార్కెటింగ్, లీడ్ బ్యాంక్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

అవగాహన కల్పించేందుకే

బాన్సువాడ నియోజకవర్గంలో ముందస్తు సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న నెమ్లిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాం. స్వల్పకాలంలో పెట్టుబడి తక్కువ, దిగుబడులు ఎక్కువగా వచ్చే వరి వంగడాలపై శాస్త్రవేత్తల సమక్షంలో రైతులకు వివరించనున్నాం. ఇదే తీరున జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వీరాస్వామి, వ్యవసాయాధికారి, కామారెడ్డి

# చురుగ్గా న్యాక్ భవన నిర్మాణం

నిజామాబాద్ : నిజామాబాద్ కలెక్టరేట్ సమీపంలో నైపుణ్యాభివృద్ధి కేంద్ర భవన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. పనులు పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ప్రస్తుతం నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో కొనసాగుతోంది. టైలరింగ్, తాపీ మేస్త్రీ, హౌస్ వైరింగ్ తదితర అంశాల్లో కాస్త నైపుణ్యం ఉన్నవారికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డు జారీ చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే నిజామాబాద్‌తోపాటు కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల జిల్లాల వారికి ఎంతో ఉపయోగపడనుంది. ఆయా ప్రాంతాలవారికి శిక్షణతో పాటు వసతి కల్పిస్తారు.

# భగ్గుమంటున్న డంపింగ్ యార్డులు



జనగామ : స్వచ్ఛ భూపాలపల్లి అంటూనే స్వచ్ఛతకు తూట్లు పొడుస్తున్నారు. తడి, పొడి చెత్తపై అవగాహన పెంచాలంటూనే చెత్త కుప్పలను గుట్టలుగా పోస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం సూచనలకు పురపాలిక అధికారుల ఆచరణకు ఎక్కడా పొంతన ఉండటం లేదు. సుమారు రెండు ఎకరాల్లో విస్తరించి ఉన్న డంపింగ్ యార్డు పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేశారు. అపరిశుభ్రతతో పాటు అనారోగ్య సమస్యలకు కారణంగా నిలుస్తోంది. యార్డును చదును చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇదేంటని పాలకవర్గం ప్రశ్నించే పరిస్థితుల్లో లేదు. వేసవి వచ్చిందంటే యార్డులో చెలరేగుతున్న మంటలతో చుట్టుపక్కల ఉన్న వందలాది చెట్లకు నష్టం ఏర్పడుతోంది. ముఖ్యంగా డంపింగ్ యార్డు పక్కనే సింగరేణి యాజమాన్యం నిర్మించిన సోలార్ విద్యుత్తు ప్లాంటుకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులుండగా ఇందులోని 24 వార్డుల్లో సేకరించిన చెత్తంతా సీఆర్‌నగర్ ప్రాంతంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ప్రతిరోజు సుమారు తొమ్మిది టన్నుల వరకు చెత్తను సేకరిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో చెత్తను చదును చేసే యంత్రాలు లేవు. మంటలు ఆర్పేందుకు వాటర్ ట్యాంకర్లు అందుబాటులో లేవు.తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. డంపింగ్ యార్డులో రాత్రి పగలూ కాపలాదారులను నియమించాలి.యార్డులో భారీ మొత్తంలో చెత్త కుప్పలుగా పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలను చదును చేసే ప్రక్రియ ప్రతి రోజు కొనసాగాలి. గతంలో శ్మశానవాటిక ప్రాంతంలో పోసిన చెత్త మంటలు అంటుకోవడంతో జనాలకు ఇబ్బంది ఏర్పడింది.డంపింగ్ యార్డులో శాశ్వత పరిష్కారంగా తప్పనిసరిగా వాటర్ సంపుల నిర్మాణం ఉండాలి. దాదాపు 25 వేల లీటర్ల నీటిని నిల్వ చేసుకునేలా సంపులను అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రమాద సమయాల్లో అగ్నిమాపక శకటం సంఘటన స్థలానికి రావడానికి అనుకూలంగా రహదారి ఉండేలా చర్యలు తీసుకోవాలి.

అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి

డంపింగ్ యార్డుతో కాలనీవాసులకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. కాలనీలో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందినవారే నివాసం ఉంటున్నారు. పిల్లలు, పెద్దలు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. డంపింగ్ యార్డుకు వ్యర్థాలను తీసుకొచ్చి ఇష్టానుసారం పడేయడం, కాలినప్పుడల్లా కాలుష్యం, పొగ కమ్ముకోవడంతో శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నాం.

పాషా, సీఆర్‌నగర్పశువులు మృత్యువాత పడుతున్నాయి

డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను చదును చేయకపోవడంతో చెత్త కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు తిని పశువులు ఇప్పటి వరకు పదుల సంఖ్యలో మృతి చెందాయి. డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలతో వెలువడే పొగ కిలోమీటర్ దూరం వరకు కమ్మేస్తుంది. దీంతో ఆ ప్రాంతంలో తిరిగే జనాలకు దగ్గు, ఆయాసం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. యార్డును సమర్థంగా నిర్వహించాలి. రమేష్, శాంతినగం

# స్వచ్ఛతపై చైతన్యం..!




జనగామ : ప్రభుత్వ పురపాలికల్లో వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తోంది. రెడ్యూస్, రీ–యూస్, రీ–సైకిల్ (ఆర్.ఆర్.ఆర్) కేంద్రాలుగా నామకరణం చేసింది. తడి పొడి చెత్త సేకరణ ఎప్పటి నుంచో జరుగుతున్నప్పటికీ ట్రిపుల్ ఆర్ కేంద్రాలు నెలకొల్పాలనే ఒక నూతన ప్రక్రియ చేపట్టింది. పునర్వినియోగ వ్యర్థాలు సేకరించడం దీని ముఖ్యోద్దేశం. జిల్లాలోని డోర్నకల్, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూరు మున్సిపాలిటీలలో వ్యర్థాల సేకరణ ఇప్పటికే మొదలైంది.కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు పురపాలక సంఘాలు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా పురపాలక సంఘాల్లో ఆర్. ఆర్. ఆర్. కేంద్రాలను నెలకొల్పుతున్నారు. జిల్లాలోని పురపాలక సంఘాల్లో జూన్ 5 వరకు మెప్మా ఆర్పీల సహకారంతో ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం కోసం అధికారులు వివిధ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడు విధానాలు పాటించడం వల్ల పట్టణాలు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపరిచేందుకు స్వచ్ఛభారత్ మిషన్ పకడ్బందీగా ఇళ్లల్లో ఉండే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా ఏ వస్తువును ఎలా వినియోగించుకోవచ్చో అనే అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. ఇందుకోసం పురపాలక సంఘాల్లోని ప్రధాన ప్రాంతాల్లో త్రిబుల్ ఆర్ కేంద్రాలను నెలకొల్పారు. ఈ కార్యక్రమాల అమలుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఫలితంగా పట్టణాల్లో చెత్త సమస్యకు కొంత పరిష్కారం లభించనుంది.

సామగ్రి ఇదే..

పాత దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు, పాదరక్షలు, వంట గిన్నెలు, పుస్తకాలు, పేపర్లు, దిండ్లు, పరుపులు, బల్లలు, కుర్చీలు, మంచాలు, పాలిథిన్ ఇవన్నీ పునర్వినియోగం కింద పరిగణనలోకి తీసుకుంటారు. రోజులు, నెలలు, ఏళ్ల తరబడి ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తగ్గించడానికి పురపాలిక శాఖ ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. వార్డుల వారీగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాలలో వ్యర్థాల సేకరణకు ప్రత్యేక సిబ్బంది నియామకం జరిగింది.

పకడ్బందీగా వివరాల నమోదు

వార్డుల్లో సేకరించిన వ్యర్థాల వివరాలను ఆర్ఆర్ఆర్ కేంద్రంలోని రిజిస్టర్‌లో పకడ్బందీగా నమోదు చేయాలి. పాత సామగ్రిని తీసుకొచ్చిందెవరు? వారి పూర్తి చిరునామాను చరవాణి సంఖ్యతో సహా సేకరించాలి. ఈ విధంగా సేకరించిన వస్తువులు ఆయా వార్డులలో ఎవరికైనా అవసరమైతే వారికి ఉచితంగానే ఇవ్వాలి. ప్రభుత్వ ఆదేశానుసారం 'మేరా లైఫ్ మ ఏరా స్వచ్ఛ షెహర్' పేరిట దీని గురించి మెప్మా సిబ్బంది విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్లాస్టిక్ అట్టముక్కలు.. కాగితాల సేకరణ

ప్లాస్టిక్ వస్తువులు, అట్టముక్కలు, కాగితాలను సేకరించి వాటిని సంబంధిత కేంద్రంలో రీసైక్లింగ్ చేయడం వల్ల మళ్లీ కొత్త వస్తువులుగా తయారవుతాయి. ఆ వస్తువులు ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల ప్లాస్టిక్ సామగ్రి భూమిలోకి కరిగిపోకుండా అలాగే ఉంటాయి. అట్టముక్కలు, కాగితాలను కాల్చడం వాయు కాలుష్యం ఏర్పడే అవకాశం ఉంది. ఈ ఉపద్రవాల నుంచి తప్పించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆ వస్తువులను మళ్లీ కొత్తగా చేసుకోవడం వల్ల కాలుష్యం బారి నుంచి తప్పించుకోవచ్చు. ఇందుకు సంబంధించిన ప్లాస్టిక్ వస్తువులను త్రిబుల్ ఆర్ కేంద్రాల్లో అప్పగించాలి.

కేంద్రాల ఏర్పాటు

కాలుష్యాన్ని పెంచుతూ పర్యావరణానికి విఘాతం కలిగించే వస్తువుల వాడకాన్ని తగ్గించడం (రెడ్యూస్), కొన్ని వస్తువులను పునరుత్పత్తి చేయడం (రీసైక్లింగ్) కొందరికీ పనికిరాని వస్తువులు ఇతరులకు ఉపయోగపడే విధంగా అవసరమైన వారికి ఆ వస్తువులను అందించడం (రీయూజ్) లక్ష్యంగా ఈ కేంద్రాలు పని చేస్తాయి. మహబూబాబాద్‌లో గాంధీపురం, గాయత్రీ దేవాలయం సమీపంలోని డీఆర్‌సీ, నందమూరినగర్, గాంధీపార్కు సమీపంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని డోర్నకల్, మరిపెడ, తొర్రూరు పురపాలక సంఘాల్లోని ప్రధాన కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

ఇతరులకు ఉపయోగపడేలా..

కొంతకాలం వాడిన తర్వాత తమకు ఉపయోగపడవనుకున్న వస్తువులను చెత్త కుప్పల్లో వేయకుండా కేంద్రాల్లో అప్పగిస్తే ఆ వస్తువులు ఎవరికీ ఉపయోగపడతాయో గుర్తించి మెప్మా ప్రతినిధుల ద్వారా అవసరమైన వారికి అందిస్తారు. నిరుపేదలకు పుస్తకాలు, దుస్తులు, చీరలు, ఇతర వస్త్రాలు అనాథలకు, నిరాశ్రయులకు పంపిణీ చేస్తారు. దీంతో వారికి ఆ వస్తువులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

జూన్ 5వ తేదీ వరకే..!

ఆర్ఆర్ఆర్ కేంద్రాల నిర్వహణ జూన్ 5వ తేదీ వరకే ఉంటుంది. ట్రిపుల్ ఆర్ కేంద్రాల్లో సమకూరిన వ్యర్థాలు ఎవరికైనా అవసరం ఉంటే తీసుకెళ్లే వీలు కల్పించాం. గడువు తేదీ ముగిశాక మిగిలిన వ్యర్థ నిల్వలను పునర్వినియోగానికి పంపుతాం. స్వచ్ఛ పురపాలిక లక్ష్య సాధనకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది. పౌరులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఎవరికి వారు వ్యర్థాలను తీసుకొచ్చి ఇవ్వడమే కాదు మరో నలుగురికి ఈ విషయం తెలపాలి.మున్వర్‌అలీ, పుర కమిషనర్, డోర్నకల్

# దృష్టి సారిస్తేనే పూర్వవైభవం

చేగుంట: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిన వల్లూరు నర్సరీ నిర్వహణ కొరవడి అధ్వానంగా మారింది. గతంలో నిత్యం పర్యాటకులతో కళకళలాడిన ఆ ప్రాంతం నేడు వెలవెలబోతోంది. 17 ఏళ్ల కిందట 44వ జాతీయ రహదారి పక్కనే దీనిని ఏర్పాటు చేశారు. అప్పట్లోనే రూ.6 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. ఇందులో మొక్కల పెంపకం చేపట్టడంతో అవి ఏపుగా పెరిగి ప్రశాంత వాతవరణం నెలకొంది. ఆ దారిలో ప్రయాణించేవారు కొద్దిసేపు సేదదీరి వెళ్లేవారు. చెక్‌డ్యాంలు, చిన్న నీటికొలను నిర్మించారు. అలాగే వివిధ రకాల జంతువులు, పక్షుల పెంపకం చేపట్టారు. 35 రకాల ఔషధ మొక్కలు ఉండేవి. మెదక్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ నుంచి



విద్యార్థులు సందర్శించేవారు. రానురాను అటవీ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం చెట్లు తప్ప, మిగతావి ఏమీ కనిపించడం లేదు. పూర్వవైభవం తీసుకుని వస్తామని అధికారులు చెబుతున్నా పరిస్థితిలో మార్పు లేదు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, అదిలాబాద్ కరీంనగర్, సిరిసిల్ల సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలతో పాటు దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన ఐఎఫ్ఎస్ అధికారులు, శిక్షణలో ఉండే ఎఫ్ఆర్‌వోలు, బీట్ అధికారులు వీఎస్ఎస్ సిబ్బందికి దీనిని శిక్షణ కేంద్రంగా ఉపయోగించారు. ఇపుడా పరిస్థితి లేదు. ఇక్కడ వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసి పక్కా కార్యాచరణతో అడుగేస్తేనే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

నర్సరీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. నిధులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. మొక్కల పెంపకంపైనే దృష్టి కేంద్రీకరించాం. పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. విద్యాసాగర్, ఎఫ్ఆర్‌వో, రామాయంపేట

# విద్యాదీప్తి... నైపుణ్యప్రాప్తి

చేగుంట:కరోనా సమయంలో మొదలైన శిబిరంతో ప్రయోజనాలు ఉండటంతో ఆ తర్వాతి ఏడాది 8 చోట్ల ఏర్పాటుచేశారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలోని మరికొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ షురూ చేశారు. ఇలా ఈ సారి 48 పఠన శిబిరాలు కొలువుదీరడం గమనార్హం. వీటికితోడు ఎన్జీవోల సహకారంతో మరో 62 చోట్ల వీటిని ఏర్పాటుచేసి కొనసాగిస్తున్నారు. వీటిల్లో బోధించే వాలంటీర్లకు ఎలాంటి వేతనం ఇవ్వరు. స్వచ్ఛందంగా పాఠాలు బోధించాల్సి ఉంటుంది. అప్పాయిపల్లి గ్రామంలోని ఓ శిబిరంలో సర్పంచి గీతా ఠాగూర్ స్వయంగా పాఠాలు బోధిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు, యువకులు ముందుకొచ్చి తరగతులు చెబుతున్నారు.

ఆయా అంశాలపై..వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ఉండేందుకు వీటి ఏర్పాటుకు గ్రామస్థులు మొగ్గు చూపుతున్నారు. నిత్యం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిబిరాన్ని కొనసాగిస్తారు. ఉపాధ్యాయులు ఆయా అంశాల్లో పాఠాలు బోధిస్తారు. రాయడంలోనూ తీర్చిదిద్దుతారు. విద్యతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు. గుణింతాలు, ఆంగ్లంలో మాట్లాడటం, ఎవరితో ఎలా మాట్లాడాలి, ఇతరులను గౌరవించడం ఎలా, నైతిక విలువలు, ఆరోగ్యంగా ఉండేందుకు చిట్కాలు, ధాన్యం, యోగా, సంగీతం, నృత్యం, ఆటలు, పాటలు, చిత్రలేఖనం, ఆధ్యాత్మికత, దేశభక్తి, వివిధ కళలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన వారిని పాఠశాలకు పిలిచి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వికారాబాద్, మంతన్‌గౌడ్, మర్పల్లి, నస్కల్, నాగిరెడ్డిపల్లి, ఉడిమేశ్వరం, చిన్ననందిగామ, బుల్కాపూర్ తదితర చోట్ల కొనసాగుతున్నాయి.

చదువుకు దూరం కాకుండా..ప్రజా సేవ కంటే విద్యార్థులకు బోధించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. తనతో పాటు మరో 8 మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి తరగతులు చెబుతున్నారు. వేసవిలో పిల్లలు చదువుకు దూరం కాకుండా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది.

గీతాఠాగూర్, సర్పంచి, అప్పాయిపల్లి

బొమ్మలు గీయడం వచ్చింది..

బొమ్మలు ఎలా గీయాలి.. రంగులెలా వేయాలో నేర్చుకున్నా. ఆంగ్లంలో మాట్లాడే పదాలను తెలుసుకున్నా. వీటితో పాటు అన్ని ఆటలు ఆడే విధానం, మెలకువలు తెలుసుకున్నా. ఆట పాటలతో చదువుకోవడం సెలవుల్లో సరదా అనిపిస్తోంది.

కార్తీక్ రాథోడ్, విద్యార్థి

గుణింతాలు నేర్చుకున్నా

గణితంలో మెలకువలు నేర్చుకున్నాను. వేసవి శిబిరంలో 6 నుంచి 20 వరకు గుణింతాలు నేర్చుకోగలిగా. చిత్రాలు గీయడం, దేశభక్తి గీతాల ఆలాపన, మహనీయుల జీవిత చరిత్రలు చదివాను. ఆట పాటలతో చదువుకుంటూ సెలవులను సరదాగా గడుపుతున్నా.

హారిక, విద్యార్థిని

ఇతర రాష్ట్రాల్లో సైతం..

వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న పఠన శిబిరాల గురించి తెలియడంతో దిల్లీకి చెందిన ఓ బృందం అప్పాయిపల్లికి వచ్చారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి చూసి ఎంతో సంతోషించారు. వేసవి పఠన శిబిరాలు సత్ఫలితాలు అందిస్తున్నాయని గ్రహించారు. పిల్లలను అన్ని రకాలుగా పరీక్షించారు. ప్రతిభ చూపగా ప్రశంసించారు. ఇలాంటి ప్రయోగాన్ని ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెండు నెలల పాటు..వేసవి శిబిరానికి చిన్నారులు ఆసక్తిగా వస్తున్నారు. చదువుతో పాటు ఆటలు, నృత్యాలు, కర్రసాము వంటి విద్యార్థులకు తెలియని ఆటలు, వ్యక్తిగత రక్షణకు ఉపయుక్తమైన వాటిని వివరిస్తున్నాం. నేర్పించిన వాటిపై విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించారు. దిల్లీ బృందం సభ్యులు సైతం ప్రశంసించింది. వీరేశం, ఉపాధ్యాయుడు

# రంగు పడేనా.. తుప్పు వదిలేనా..?

చర్ల : తెలుగు రాష్ట్రాల్లో అత్యంత క్యాచ్‌మెంట్ ఏరియా ఉన్న మధ్యతరహా ప్రాజెక్టుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ఒకటి. ఎగువ ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వరద నీటితో ఈ జలాశయం ఇట్టే నిండుకుండలా మారి ఆయకట్టుకు పుష్కలంగా సాగునీటిని అందిస్తోంది. రైతుల పాలిట కల్పతరువుగా ఉన్న ఈ జలాశయంపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రాజెక్టు ప్రారంభం అనంతరం దశాబ్దాల తర్వాత 2006లో ఒకసారి మాత్రమే దీనికి రంగులు వేశారు. ప్రతి మూడేళ్లకు ఓసారి రంగులు వేయాల్సి ఉండగా ఈ ప్రాజెక్టుకు గత 17 ఏళ్లుగా ఆ ఊసే లేదు. దీంతో ఎక్కడికక్కడ ఇనుప సామాగ్రి తుప్పు పడుతోంది. ఇలాగే వదిలేస్తే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి.



ఈ ఏడాదైనా ప్రాజెక్టుకు రంగులు వేస్తారా రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తడంలో కీలకమైన హయస్టు వంతెన పూర్తిస్థాయిలో తుప్పుపడుతోంది. దానిపై ఫుట్ బ్రిడ్జి ఐరన్ ప్లేట్లు దెబ్బతిని ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎప్పుడూ నీటిలో ఉండే క్రస్ట్ గేట్లు తుప్పు పడుతున్నాయి. గేర్‌బాక్సులు, గేట్లు ఎత్తే యంత్రాలదీ ఇదే పరిస్థితి. రంగుల వేయించేందుకు రూ.2.17 కోట్ల మేర నిధులివ్వాలని అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఫలితం ఇంకా దక్కని పరిస్థితి. ప్రాజెక్టుకు రంగుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఇటీవల ఓ అండ్ ఎం అధికారులు సందర్శించి పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని డీఈ తిరుపతి తెలిపారు.

# పెరిగిన హోదా.. సేవలు మెరుగుపడేనా!

జగిత్యాల : పేదలకు మెరుగైన వైద్యం అందించే ధర్మపురి ఆస్పత్రికి సమస్యల సుస్తీ చేసింది. పెద్ద ఆసుపత్రిగా హోదా పెరుగుతున్నా.. ఇక్కడికి వచ్చే వారు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిస్థాయి వైద్య సిబ్బంది సహా సరైన వైద్య పరికరాలు, యంత్రాలు లేకపోవడం ప్రతిబంధకంగా మారుతోంది. నెలకు ఐదారువేల మంది ఇక్కడికి పరీక్షల నిమిత్తం వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించే దిశగా కృషి చేస్తుంది. ధర్మపురి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 8 పడకలతో ప్రారంభమై ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి స్థాయికి చేరింది. ఇటీవలే వైద్య ఆరోగ్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్‌కు బదలాయించగా సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారి ఇప్పుడిప్పుడే జిల్లా స్థాయి ఆసుపత్రిగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు సేవలందిస్తున్నారు. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్, అనస్తీషియా, పల్మనాలజిస్ట్ తదితర విభాగాల్లో ప్రతి రోజు 150 మంది ఓపీ, సుమారు 20 మంది వరకు ఇన్‌పేషెంట్లకు సేవలు అందిస్తున్నారు. నిత్యం 50 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి వివిధ రకాల పరీక్షల కోసం జగిత్యాలకు తరలిస్తున్నారు.

వైద్యులంతా డిప్యుటేషన్‌పైనే...

ప్రస్తుతం ధర్మపురి ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యులందరూ డిప్యుటేషన్‌పై విధుల్లో ఉన్నవారే. మొన్నటి వరకు పీహెచ్‌సీ పరిధిలో ఉండగా ఇద్దరు వైద్యులు మాత్రమే పూర్తిస్థాయి సేవలందించారు. గత ఏడాదిన్నర క్రితం ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్‌కు మారడంతో జగిత్యాల ప్రధాన వైద్యశాలలో ఉన్నవారిని తాత్కాలిక ప్రాతిపదికన



నియమించారు. పూర్తిస్థాయి సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అంటున్నారు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

బకాయిలు చెల్లించలేదని ఆసుపత్రిలో అంతర్జాల సౌకర్యాన్ని తొలగించారు. దీంతో తమ ఫోన్‌లో హాట్‌స్పాట్ ద్వారా సమాచారాన్ని అంతర్జాలంలో పొందుపరుస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

ఆసుపత్రిలో రోజూ 150 మందికి ఓపీ సేవలను అందిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న సిబ్బంది ద్వారా ప్రజలకు వైద్య సదుపాయాలలో ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమిస్తే మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి అవకాశం ఉంటుంది.

నవీన్, ఆసుపత్రి సూపరింటెండెంట్

పరికరాలు లేక ఇక్కట్లు

నాకు జ్వరం రావడంతో నాలుగు రోజులుగా ఆసుపత్రిలో ఉంటున్నా. డాక్టర్లు బాగానే చూస్తున్నారు. ఎక్స్‌రే, రక్త పరీక్షలకు సంబంధించి పరికరాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. అధికారులు వైద్య సదుపాయానికి సంబంధించిన పరికరాలను సమకూర్చాలి. బి.లక్ష్మి

# అడవి బిడ్డల కష్టాలు తీరేనా..?




భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 32 మండలాలు ఉండటం ప్రత్యేకతను సంతరించుకుంది. భద్రాద్రి జిల్లాలోని 23 మండలాలే కాకుండా ములుగు జిల్లా (వాజేడు, వెంకటాపురం), మహబూబాబాద్ జిల్లా (గార్ల, బయ్యారం), ఖమ్మం జిల్లా (కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు మండలాలు పూర్తిగాను, సత్తుపల్లి, పెనుబల్లి మండలాలు పాక్షికంగా)లో ఐటీడీఏ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వంటి వారు గిరిజనులతో మమేకమవుతున్నారు. ఆచార, సంప్రదాయాలు తెలుసుకుని అడవి బిడ్డల కష్టాలు వింటున్నారు. ఈపరిస్థితుల్లో పీఓలు కార్యాలయానికి పరిమితం కాకుండా అన్ని మండలాలను సందర్శించాల్సి వస్తోంది. ప్రాజెక్ట్ అధికారులుగా విధులు నిర్వర్తించే ఐఏఎస్‌లు దీన్ని భారంగా భావించనప్పటికీ నాలుగు జిల్లాల్లో క్షేత్ర పర్యటనలు చేయటం ఆషామాషీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా ప్రతి దర్బారులో పీఓ ఉండాలి.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వేడుకోలు

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాలనా ఫలాలు అట్టడుగున ఉన్నవారికీ అందాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని పది జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారు. గ్రామపంచాయతీల సంఖ్య పెరిగింది. మండలాలను విభజించారు. ఐటీడీఏల విభజన అంశం కేంద్రం పరిధిలో ఉండటంతో దీని జోలికి ఎవరూ పోవడం లేదు. సంబంధిత ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చొరవ చూపాలని గిరిజనులు కోరుతున్నారు. జడ్పీ సమావేశాలపై ఉన్న ఆసక్తిని ఐటీడీఏ సమీక్షలపైనా కనబరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐటీడీఏని విభజిస్తే..

రాష్ట్రంలో భద్రాచలం, మన్ననూరు, ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏలు గిరిజనులకు సేవలందిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు 31.77 లక్షల మంది నివసిస్తుండగా భద్రాద్రి జిల్లాలో 3.53 లక్షల మంది గిరిజనులున్నారు. నాలుగు జిల్లాలను పరిగణనలోకి తీసుకుంటే గిరిజనుల శాతం పెరుగుతుంది. ఇంతమందిపై ఐటీడీఏ ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి. రెండు దశాబ్దాల చరిత్ర కలిగిన గిరిజన బీఈడీ కళాశాలకు ప్రిన్సిపల్ పోస్టును రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పలు కీలక హోదాలు ఇన్‌ఛార్జిలతో కొనసాగుతున్నాయి.

ములుగు జిల్లాలో కలిసిన వెంకటాపురం గిరిజనులు ఐటీడీఏ పథకాలకు భద్రాచలం రావాలంటే అవస్థలు పడుతున్నారు. అక్కడి అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. కొన్ని పథకాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాతిపదికనే మంజూరవుతున్నాయి. ఈనేపథ్యంలో 32 మండలాల పరిధి వల్ల ఒనగూరే ప్రయోజనం ఏంటన్నది అంతుచిక్కడం లేదు.కొవిడ్ ఉద్ధృతి, గోదావరి వరదల తరుణంలో వివిధ ఆదివాసీ ఆవాస ప్రాంతాలు దెబ్బతిన్నాయి. బాధితులను ఉన్నతాధికారులు సకాలంలో పరామర్శించలేదన్న ఆరోపణలున్నాయి.ఏజెన్సీ మండలాలు తక్కువ కలిగిన జిల్లాలో మినీ ఐటీడీఏలను ఏర్పాటు చేయవచ్చుననే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చటం లేదు. ఐటీడీఏల విభజన అసాధ్యమనుకుంటే ఆ స్థాయిలో నిధులు ఉండేలా పర్యవేక్షణ సాగాలని కోరుతున్నారు.

# మానవ వ్యర్థాలతో సేంద్రియ ఎరువు



జగిత్యాల : పట్టణాన్ని స్వచ్ఛత దిశగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విభిన్న కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా మానవ వ్యర్థాలను పునర్ వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుంది. నర్సింగాపూర్ శివారులో 01-04-22న మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో ఎకరం స్థలంలో చేపట్టిన ఆధునిక కేంద్రంలో వ్యర్థాలను శుద్ధిచేసి ఎరువుగా మార్చి దానిని మొక్కలకు, రహదారుల వెంట చెట్లకు, వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారు.ప్రిస్టిన్ భారత్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికత ఆధారంగా ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 35 కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన కేంద్రంలో 3 వేల లీటర్ల మేరకు వ్యర్థాలను ఒకే రోజు శుద్ధి చేయవచ్చు. 95 శాతం నీరు, 5 శాతం వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చుతున్నారు. సౌరశక్తితో వ్యర్థాలకు రక్షణ కల్పించి నిల్వ చేస్తున్నారు. జగిత్యాలలో ప్రతి నెల మానవ వ్యర్థాలను శుద్ధి చేయడం ద్వారా 7 టన్నుల సేంద్రియ ఎరువు తయారవుతుంది. పట్టణంలో 25 వేల కుటుంబాలు ఉన్నాయి. 1.20 లక్షల జనాభా ఉంది. ఇందుకనుగుణంగా 5 సెప్టిక్ ట్యాంక్ వాహనాలకు బల్దియా అనుమతినిచ్చింది. ప్రతి మూడేళ్లకొకసారి ట్యాంకు నిండినా నిండక పోయినా అందులోని వ్యర్థాలను విధిగా యజమానులు తొలగించుకోవాలనే నిబంధన ఉంది. ఈ మేరకు బల్దియా చెత్త సేకరణ వాహనాల్లో మైకుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. గతంలో సెప్టిక్ ట్యాంకుల నుంచి తొలగించిన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారేవి. నూతనంగా నిర్మించిన శుద్ధీకరణ కేంద్రంతో పరిసరాలు శుభ్రంగా మారుతున్నాయి.

శుభ్రత కోసం టోల్‌ఫ్రీ నంబర్

పట్టణంలో సెప్టింక్ ట్యాంకు శుభ్రం చేయించుకోవాలనుకునే వారి కోసం మున్సిపాలిటీ ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 14420 కేటాయించింది. ట్యాంకు నిండిన వారు ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే బల్దియా సిబ్బంది వాహనాల సమాచారం ఇస్తారు. రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఛార్జీ చెల్లిస్తే సిబ్బంది ట్యాంకు శుభ్రం చేస్తారు.

ప్రయోజనాలు..శుద్ధీకరణ కేంద్రంలో తయారైన ఎరువుతో ప్రధాన రహదారులలోని చెట్లు, మొక్కలు పచ్చదనం సంతరించుకున్నాయి. హరిత హారం, పల్లె ప్రకృతి వనం, నర్సరీలకు, కేంద్రం ఆవరణలో ఉన్న చెట్లకు శుద్ధిచేసిన నీటిని, ఎరువులను వినియోగించడం ద్వారా చుట్టు పక్కల పరిసరాల్లో ప్రకృతి పచ్చదనం సంతరించుకుంది. సెప్టిక్ ట్యాంకు నిండినప్పుడు దుర్వాసన, దోమలు వ్యాప్తి చెందుతాయి. ఫలితంగా పలు జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా సెప్టిక్ ట్యాంకును శుభ్రపరచుకోవాలి. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు అన్ని వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

# అందుబాటులోకి వచ్చేదెప్పుడు?

జగిత్యాల : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు అనుగుణంగా ప్రతి గ్రామంలో రూ.2.20 లక్షలతో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో 380 పంచాయతీలలో వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టగా ఇందులో 367 గ్రామాల్లో పూర్తి చేసినట్లు నివేదికల్లో వెల్లడించినా, ఎక్కడ చూసిన వాటి వినియోగం కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు స్థలాభావంతో పాటు గ్రామాలకు దూరంగా ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో బోర్డులు పెట్టి వదిలేయగా మరిన్ని గ్రామాల్లో పరికరాలను పక్కనే పడేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించడం సాధ్యమయ్యేలా కనిపించడంలేదు. అధికారులు ముందుగా ఎంపిక చేసిన స్థలాన్ని చదును చేసి వాటిల్లో కబడ్డీ, వాలీబాల్ కోర్టులతోపాటు లాంగ్‌జంప్, వ్యాయామం చేసేందుకు ఒకటి, రెండు వరుసల లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. స్థల సమస్య ఉన్న పంచాయతీల్లో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గ్రామాలకు దూరంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేశారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు పూర్తి స్థాయిలో స్థలం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతుండగా క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో మరింత ఇబ్బందిగా మారింది.

వసతులు కల్పించడం సాధ్యమేనా?

అనేక గ్రామాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రా



ల్లోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయగా మరిన్ని గ్రామాల్లో బోర్డులు పెట్టి వదిలేశారు. అంతేకాకుండా ప్రాంగణాల చుట్టూ మొక్కలు(బయో ఫెన్సింగ్) నాటి కలుపు తీయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా వాటిని ఇప్పటి వరకు నాటినట్లు కనిపించడంలేదు. జిల్లా వ్యాప్తంగా 366 గ్రామాల్లో వ్యాయామం చేసే వరుసలు, 261 గ్రామాల్లో లాంగ్‌జంప్ కోర్టులు, 368 ప్రాంతాల్లో వాలీబాల్, 356 గ్రామాల్లో కబడ్డీ, 318 గ్రామాల్లో ఖోఖో కోర్టులు ఏర్పాటు చేసినట్లు చూపించారు. అంతేకాకుండా 336 గ్రామాల్లో క్రీడాప్రాంగణాల బోర్డులు, 350 గ్రామాల్లో ఒకే చోట ఆట స్థలం ఏర్పాటు చేసి పరికరాలు అమర్చినట్లు, 77 ప్రాంతాల్లో మొక్కలను నాటినట్లు 363 గ్రామాల్లో కలుపు మొక్కలు తొలగించినట్లు నివేదికల్లో కనిపిస్తుంది. వీటన్నింటితోపాటు 367 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు వినియోగంలో ఉన్నట్లు చూపడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

# నగరాభివృద్ధికి పరుగులు

కరీంనగర్ : పెండింగ్ పనులతో పాటు కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులకు ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు ముఖ్యమంత్రి హామీ నిధులు గతంలో మంజూరు చేయడంతో కనీస సౌకర్యాలు మెరుగుపర్చుకోవడానికి వీలు కలిగింది. ఆరేళ్ల కిందట మొత్తం మూడు విడతలుగా రూ.347.23 కోట్లు నగరానికి నిధులు మంజూరయ్యాయి. మొదటి విడత మార్చి 2017లో రూ.100 కోట్లు, రెండోవిడత డిసెంబర్ 2017లో రూ.147.23 కోట్లు, సెప్టెంబర్ 2018లో మూడో విడతలో రూ.100 కోట్లు కేటాయించారు. ఆ సమయంలో ఏ డివిజన్‌లో అడుగులేసినా అభివృద్ధి పనుల జోరు కనిపించింది. అదే తరహాలో ప్రస్తుతం అన్ని డివిజన్‌లలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్ల విస్తరణ వంటి పనులు చేసుకునే వీలు కలగనుంది.

ప్రతీ డివిజన్‌కు నిధులు

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో లేని కాలనీలు, శివారు ప్రాంతాలు, విలీన



కాలనీలకు సీఎంఏ నిధులలో ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో డివిజన్‌కు కనీసం రూ.కోటి నుంచి రూ.4 కోట్ల వరకు కేటాయించినట్లు తెలిసింది. ఒక్కో విలీన కాలనీకి సుమారు రూ.3 కోట్లకు తగ్గకుండా నిధులు మంజూరు చేసినట్లుగా చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఇందులోనే పూర్తి చేసే అవకాశముంది.

ప్యాకేజీ పద్ధతిలో..

స్మార్ట్‌సిటీలో ప్యాకేజీ పద్ధతిలోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తద్వారా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తుండటంతో సీఎంఏ నిధులకు సంబంధించి కొత్తగా ఇచ్చిన ప్రతిపాదనలకు సింగిల్ ప్యాకేజీలో టెండర్లు పిలిచేలా పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వులో స్పష్టం చేశారు. గతంలో టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా మొండికేసిన గుత్తేదారులతో ప్రజలు, పాలకవర్గ సభ్యులు నానా అవస్థలు పడ్డారు. పైగా పనులు చేసేందుకు తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి రాకుండా గడువులోగా, ఏకకాలంలో పనులు చేసేలా కార్యాచరణ చేసినట్లుగా తెలుస్తోంది.

15లోగా టెండర్లు ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించి మిగులు నిధులు రూ.132.94 కోట్లకు పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఈ నెల 24న మెమో జారీ చేశారు. నిధులకు పరిపాలన అనుమతి ఇస్తూ త్వరితగతిన టెండర్లు పిలిచి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దాంతో సుమారు 166కి పైగా పనులు చేపట్టేందుకు వీలు కలిగింది. సీఎంఏ నిధుల మంజూరు నేపథ్యంలో వచ్చే నెల 15లోగా టెండర్లు పూర్తి చేసి ఆ నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తామని కరీంనగర్ మేయర్ సునీల్‌రావు పేర్కొన్నారు.

# నీళ్లిచ్చే కాల్వలపై నిర్లక్ష్యం

జగిత్యాల : సాధారణంగా జూన్ మొదటి పక్షం నుంచి వానాకాలం పంటలసాగు మొదలవుతుండగా ఈ వానాకాలంలో నెల రోజుల ముందుగానే సాగు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఈ తరుణంలో పంటకాలం ముందుకు జరిగేలా పలు వ్యవసాయ అనుబంధ శాఖలు సిద్ధమవుతుండగా నీటిపారుదల పరంగానూ తగిన మరమ్మతు చర్యలను చేపట్టాల్సి ఉంది.

జగిత్యాల జిల్లాలో దాదాపు 87 శాతం వరకు అధికవర్షం కురియటం, ఏప్రిల్ వరకు కాలువనీరు రావటంతో ఆయకట్టులో తలపెట్టిన మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో తక్షణమే మరమ్మతులు చేపట్టకుంటే కాలువల చివరి ఆయకట్టు వరకు నీరందటం గగనంగా మారనుంది. కాకతీయ ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితరాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యంగల కాకతీయ కాలువలోనే ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువనీటినే వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. కాలువల్లో నిండుగా నీటిని వదలకపోగా పారే కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయటంతో 38 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీనికిగాను కాలువల లైనింగ్‌ను పూర్తిచేయాలి.

నిధుల విడుదలలో జాప్యంవరదకాలువ నుంచి కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా మల్యాల మండలంలో చేపట్టిన అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తికావటంతో వచ్చే సీజనుకు అందుబాటులోకి తేవాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతుల ద్వారా చివరిభూముల వరకు నీటిని తరలించేలా చూడాలి. ప్రస్తుతం రూ.103 కోట్లవరకు మరమ్మతులు, ఇతర పనులకు వెచ్చించినా సకాలంలో నిధులు రాక చాలావరకు పనులను చేపట్టలేదు. ఇప్పటికైనా అన్ని మరమ్మతు, లైనింగ్ పనులను పూర్తిచేస్తే వచ్చే పంటకాలాల్లో కర్షకులకు ఉపయుక్తంగా ఉంటుంది. కాకతీయ కాలువతో పాటుగా వరదకాలువనుంచి చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జలమట్టం పెరిగి పంపుసెట్ల ద్వారానూ నీటిని పారించవచ్చు. పరాధీనమైన ప్రాజెక్టు భూములను స్వాధీనం చేసుకోవాలి.చెక్‌డ్యాంలు పూర్తిచేయాలి...రోళ్లవాగు ప్రాజెక్టును రూ.120 కోట్ల నిధులతో ఆధునికీకరిస్తున్నా దీనికి ఎస్సారెస్పీ నీటితోనే నింపాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ నిండని సందర్భాల్లో 2.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన రోళ్లవాగులోకి గోదావరి నీటిని ఎత్తిపోసేలా బీర్‌పూర్ మండలం రంగసాగర్‌వద్ద ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి. గోదావరి నుంచి జగిత్యాల జిల్లాలోని 26 గ్రామాలకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలి. ఇదివరకున్న పథకాలకు మరమ్మతులు జరపటంతో పాటుగా ఎత్తిపోతలను పొడిగిస్తే ఆయకట్టేతర మండలాలకూ ప్రయోజనం కలుగుతుంది. వాగులపై తలపెట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. మిషన్ కాకతీయ ద్వారా మిగిలిన చెరువుల పునరుద్ధరణను పూర్తిచేయాలి. గతంలో మాదిరిగా సాగునీటి సంఘాలను నియమించి కాలువలు, చెరువుల నిర్వహణ, ఆజమాయిషీ, స్థానిక మరమ్మతుల బాధ్యతలను అప్పగించాలి. వీటిలో రైతులే సభ్యులుగా ఉంటారు కాబట్టి నీటి యాజమాన్యం సాధ్యమవుతుంది.

# పడిపోతున్న భూగర్భ జలమట్టం

ఖమ్మం : జిల్లాలో వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలమట్టం దిగజారుతోంది. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో సాగర్ ఆయకట్టుకు సాగునీరు సరఫరా అవుతుండగా వివిధ రకాల పంటలు సాగులో ఉన్నాయి. ఉపరితలంపై సాగునీరు ప్రవహిస్తున్నా భూగర్భ జలమట్టం మాత్రం దిగువకు వెళ్తోంది. ఫిబ్రవరి ముగిసే నాటికి సత్తుపల్లి మండలంలో 2.17 మీటర్ల లోతుకు భూగర్భజలం పడిపోయింది. గతేడాది ఫిబ్రవరితో పోల్చితే 0.34 మీటర్ల లోతుకు తగ్గిపోయింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 954.40 మి.మీ. కాగా 2022 జూన్ నుంచి ఇప్పటివరకు 64 రోజుల్లో 1,057.60 మి.మీ. వర్షం కురిసింది. 10.48 శాతం అధిక వర్షం కురిసినా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే



భూగర్భ జలమట్టం పడిపోతోంది. బోనకల్లు, చింతకాని మండలాల్లో మాత్రం స్వల్పంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన బోర్లు, బావుల్లో 66 ఫీజోమీటర్లను భూగర్భ జలశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. రోజువారీగా భూగర్భ జలమట్టం వివరాలు ఫీజోమీటర్లలో అమర్చిన సెన్సర్లు నమోదు చేస్తాయి. అధికారులు ప్రతినెలా ఈ వివరాలు సేకరించి నివేదిక రూపొందిస్తారు.

# నిబంధనలు కఠినం.. ముడుపుల భారం

వరంగల్ : భవన నిర్మాణ అనుమతులు, లేఅవుటు అనుమతులు సులభతరం, పారదర్శకం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీఎస్–బీపాస్ అమల్లోకి తెచ్చింది. 2019– కొత్త పురపాలక చట్టంలో పొందుపర్చిన విధంగా లేఅవుటు అనుమతులు జారీ బాధ్యతలు కలెక్టర్లకు అప్పగించినా లంచాలు, మామూళ్లు తగ్గడం లేదు. గ్రేటర్ వరంగల్‌లో ఓ ద్వితీయ అధికారి, కుడా ప్రణాళిక విభాగంలో ద్వితీయ, తృతీయ అధికారులే మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ గంపగుత్తగా స్థిరాస్తి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. అధికారికంగా లేఅవుటు అనుమతి పొందాలంటే ఒక ఎకరానికి అన్ని రకాలైన ఫీజులకు రూ.10 లక్షల వ్యయమవుతుంటే.. ప్రజాప్రతినిధులు, పాలకవర్గం పెద్దలు, కార్పొరేటర్లు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులకు, ప్రభుత్వ శాఖాధికారులకు, ఉద్యోగుల మామూళ్లకు రూ.6లక్షలు ఖర్చవుతోందని స్థిరాస్తి వ్యాపారులు లబోదిబోమంటున్నారు.
అక్రమ లేఅవుట్లు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. అనుమతులు పొందేందుకు ఇబ్బందులుండటంతో ఎందుకు వచ్చిన తంటా అంటూ మూడో కంటికి తెలియకుండా అనధికార లేఅవుట్ల వైపు స్థిరాస్తి వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. టీఎస్–బీపాస్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి కొత్త లేఅవుట్ల జారీ పదుల సంఖ్యకే పరిమితమయ్యాయి. ఎందుకిలా జరుగుతుందోనని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కఠినతరమైన టీఎస్–బీపాస్ నిబంధనలు, అంతకంటే కష్టంగా మారిన మామూళ్ల బెడద కారణమని వెల్లడైంది. కొత్త లేఅవుటు అనుమతి పొందేందుకు ముందుగా రెవెన్యూ శాఖకు నాలా పేరు మార్పిడి ఫీజు చెల్లించాలి. తర్వాత నగర పరిధిలో గ్రేటర్ వరంగల్, కుడా పరిధిలో అయితే గ్రామ పంచాయతీ, కుడాకు రుసుములు చెల్లించాలి. అన్ని రుసుములు ముందే చెల్లించేసి, అంతర్జాలంలో టీఎస్–బీపాస్ సైటులో దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ శాఖాధికారులు అన్ని పరిశీలించి అనుమతి జారీ చేస్తారు. చివరగా జిల్లా కలెక్టర్ ఆమోదంతో నూతన లేఅవుటుకు డీపీ నంబరు, ప్లాన్ ఇచ్చేస్తారు. లేఅవుటు మొత్తం భూమిలో 10 శాతం ఓపెన్ స్పేస్ కింద వదిలేయాలి. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు స్తంభాలు, ఇతర వసతులు కల్పించడం పెను సవాల్‌గా మారింది. ఇవన్నీ ఎందుకని నగర పరిధిలో చాలామంది అనధికారం వైపు మొగ్గు చూపుతున్నారు.

ఎకరా లేఅవుట్‌కు మామూళ్లు ఇలా..
పాలకవర్గం పెద్దలకు రూ.2 లక్షలు
స్థానిక ప్రజాప్రతినిధికి రూ.లక్ష
స్థానిక కార్పొరేటర్‌కు రూ.లక్ష
అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులకు రూ.2 లక్షలు

ఇవిగో సాక్ష్యాలు
భట్టుపల్లి రోడ్డులో ఓ స్థిరాస్తి వ్యాపారి మూడున్నర ఎకరాలు లేఅవుటు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేటు లైసెన్సు సర్వేయర్ ద్వారా అధికారుల వద్దకెళ్తే కళ్లు చెదిరే విధంగా ఫీజులు, మామూళ్ల పట్టిక వివరించినట్లు తెలిసింది. దీంతో సదరు వ్యాపారి వెనక్కి తగ్గారు. మడికొండ, రాంపూర్ శివారులో మరో ఇద్దరు స్థిరాస్తి వ్యాపారులు మామూళ్ల లెక్క చూసి పరేషానయ్యారు. చివరకు చట్ట సభల ప్రజాప్రతినిధి ద్వారా ముందుకెళ్లినట్లు తెలిసింది. ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని ఓ వ్యాపారి లేఅవుటు అనుమతి పొందేందుకు సిద్ధమయ్యారు. అధికారికంగా అనుమతి పొందినా, మామూళ్లు ఇవ్వాల్సిందేనని స్థానిక కార్పొరేటర్ తెగేసి చెప్పడంతో రియల్టర్ కంగుతిన్నారు. కుడా పరిధిలో చట్ట సభల ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల తీరుతో అనుమతులు తీసుకునేందుకు వ్యాపారులు సాహసించడం లేదు.

# మత్స్య శాఖకు మచ్చలు



ఖమ్మం : మత్స్యకార కుటుంబాలకు అండగా నిలవాల్సిన మత్స్య శాఖ తీరు వివాదాస్పదమవుతోంది. ఖమ్మం జిల్లాలో అధికారులు మొదలు కింది స్థాయి సిబ్బంది వరకూ కొంతమంది వ్యవహార శైలితో శాఖకు అవినీతి మచ్చలు అంటుకుని వదలడం లేదు. ఇటీవలి ఏసీబీ సోదాలు, అధికారుల సస్పెన్షన్లకు కారణమైన ఘటనలకు తోడు ఇంకా శాఖలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పూర్వ ఖమ్మం జిల్లాలో మత్స్య శాఖకు వైరా డివిజన్ కీలకం. వైరా జలాశయంలో నిషేధిత సమయంలో చేపల వేటకు అనుమతి ఇచ్చే క్రమంలో సొసైటీ ప్రతినిధుల నుంచి నగదు డిమాండ్ చేసి, వారం క్రితం ఏకంగా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) బుజ్జిబాబు సస్పెండ్ అయ్యారు. కాంట్రాక్టు ఉద్యోగి మురళీని శాశ్వతంగా తొలగించారు. కీలక అధికారి సస్పెండ్ కావడంతో ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఏడీని నియమించారు. ప్రస్తుతం వైరా కేంద్రంగా శాఖాపరంగా చేపట్టాల్సిన ముఖ్య కార్యక్రమాలున్నాయి.

అవన్నీ పడకేశాయి..
ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలో చేపపిల్లల ఉత్పత్తి చేసే ఏకైక కేంద్రం వైరా. ఏటా మూడు కోట్ల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యం ఉంటుంది. దీంతోపాటు కొరమీను ఉత్పత్తికి రాష్ట్ర స్థాయిలోనే ఇక్కడి కేంద్రాన్ని ఎంపిక చేశారు. గత వర్షాకాల సమయంలో ఇక్కడ కొరమీను చేపపిల్లల ఉత్పత్తి విజయవంతమైందని అధికారులు ప్రకటించారు. కానీ ఎంతమేరకు సత్ఫలితాలు ఇచ్చిందన్న విషయంలో స్పష్టత లేదు. భువనేశ్వర్‌లోని జాతీయ మంచినీటి చేపల ఉత్పత్తి కేంద్రం(సిఫా)తో ఒప్పందం చేసుకుని అక్కడ నుంచి వచ్చిన శాస్త్రవేత్తల సూచనలతో ఈ ఉత్పత్తి చేశారు. రాబోయే వర్షాకాలంలో ఈ ఉత్పత్తి మళ్లీ చేయాలి. దీనికి తోడు సాధారణ బంగారుతీగ, కట్ల, రోహు వంటి చేపపిల్లల ఉత్పత్తి సైతం చేపట్టాల్సి ఉంది. చేపపిల్లల ఉత్పత్తికి ఈసరికే అవసరమైన వనరులు, చేపల తొట్లు, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలి. పూర్తి స్థాయిలో దిగుబడి సాధనకు కావాల్సిన కసరత్తు చేపట్టాలి. వైరాలో ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. సిబ్బంది లేకపోవడంతో వసతులు కనుమరుగైనా గాడినపెట్టే వారు లేరు. ముఖ్యమైన అధికారి లేకపోవడంతో పాటు కింది స్థాయి పోస్టులు ఖాళీగా ఉండటంతో పరిస్థితి చక్కబడటం లేదు.

జిల్లాలోనూ అదే తీరు
జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులుగా సభ్యత్వాల నమోదు కోసం మత్స్యకారులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలోనూ భారీ అవకతవకలు, అవినీతిని ప్రోత్సహించే చర్యలకు ఊతమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారు. అనేక మంది సభ్యులు పలు కారణాలతో మృతిచెందగా వారికి శాఖాపరంగా వచ్చే బీమా రాలేదు. ఎందుకు రాలేదో కనీస కారణాలు చెప్పలేకపోతున్నారు. సొసైటీల పరిధిలో ఉన్న చేపల చెరువుల్లో చేపల వేటకు అనుమతి కోసం నగదు డిమాండ్ చేస్తున్నారు. సభ్యత్వాలు ఇచ్చేందుకు ప్రతిభా పరీక్ష నిర్వహించాలి. ఇందుకు కూడా నగదు డిమాండ్ చేస్తున్నారు. అంతటా ఇదే పరిస్థితి.
తమకు అనుకూలంగా లేకుంటే సభ్యత్వాలకు సంబంధించిన వాటితోపాటు ఇతర ఫైల్స్‌ను మూలన వేస్తున్నారు.
అనేక సమస్యలున్నాయి: ఆంజనేయస్వామి, ఏడీమత్స్యశాఖ పరంగా అనేక సమస్యలున్నాయి. ఇటీవల అధికారుల వేటు నేపథ్యంలో మరో అధికారిని ఇవ్వాలని కోరాం. రాబోయే సీజన్‌లో చేపల ఉత్పత్తితో పాటు కొరమీను ఉత్పత్తి కీలకంగా ఉండనుంది. కానీ వసతులు లేవు. గత సీజన్‌లో కొరమీను విజయవంతమైందని చెప్పినా ఏ స్థాయిలో ఉందో స్పష్టత లేదు. ఆరోపణలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

# బిల్లులివ్వక భోజనం ఎలా?



సత్తుపల్లి : సకాలంలో బిల్లులు రాకపోవటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అప్పు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. సరకుల ఉద్దెర పెరిగిపోతుండటంతో కిరాణా, కూరగాయల వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం గౌరవ వేతనాలు ప్రకటించినా బకాయి బిల్లుల భారంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నామని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తూ కూరలకు బిల్లులు అందిస్తుంది. ఒకటి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబరు నుంచి నేటి వరకు, రాష్ట్ర ప్రభుత్వం 9, 10 తరగతి విద్యార్థులకు సెప్టెంబరు నుంచి నేటికీ బిల్లులు విడుదల చేయలేదు. గతంలో రూ.వెయ్యి చొప్పున గౌరవ వేతనం ప్రకటించగా అది సక్రమంగా చెల్లించడం లేదు. తాజాగా జీఓ నం.8 ద్వారా మరో రూ.2వేలు కలిపి రూ.3వేల చొప్పున వేతనాలు చెల్లిస్తామని గతేడాదిలో చెప్పగా నేటికీ అమలు కాలేదు.

నిర్వహణ భారం..
ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.4.97, ప్రాథమికోన్నత విద్యార్థికి రూ.7.45, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.9.95 చొప్పున కేటాయించింది. గుడ్డుకు మరో రూ.5 అదనంగా ఇస్తుండగా బయట మార్కెట్‌లో అదనంగా రూ.1–2 చెల్లించాల్సి వస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం బియ్యంతోపాటు నిత్యావసరాలు, వంట గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని నిర్వాహకులు వేడుకుంటున్నారు.
"బిల్లుల చెల్లింపులో జాప్యంతో దుకాణాల్లో రూ.1.20లక్షలు అప్పులు చేయాల్సి వచ్చింది. పదహారేళ్లుగా కార్మికురాలిగా పనిచేస్తున్నా. ప్రభుత్వాలెప్పుడు సకాలంలో బిల్లులు విడుదల చేసింది లేదు. నా భర్త కూలీ డబ్బులు కూడా అవసరాలకు వినియోగిస్తున్నా."
కొత్తపల్లి జరీనా, సత్తుపల్లి
"కొవిడ్ కంటే ముందు రెండేళ్లపాటు ఏజెన్సీలకు బిల్లులు చెల్లించలేదు. మాకు దాదాపు రూ.2లక్షల వరకు రావాల్సి ఉంది. అప్పులు పెట్టిన దుకాణాదారులు నేరుగా స్కూల్‌కి వచ్చి అడగటం ఇబ్బందిగా ఉంది."
పూచి సీత, సత్తుపల్లి
వారంలో అందిస్తాం..సోమశేఖరశర్మ, డీఈవో, ఖమ్మం
జిల్లాలో 9, 10 తరగతుల విద్యార్థులకు చెల్లించాల్సిన బిల్లులు విడుదల అయ్యాయి. జనవరి, ఫిబ్రవరికి గాను రూ.58,72,288లు విడుదల కాగా వారంలో కార్మికులకు చేరుతాయి. ఒకటో తరగతి నుంచి 8వ తరగతికి సంబంధించిన బిల్లులు కూడా సోమవారం విడుదల అయ్యే అవకాశం ఉంది.

# అక్రమ నిర్మాణాలపై ఆన్‌లైన్ ఫిర్యాదు అస్త్రం

పాల్వంచ : ఇకపై అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరిగినా.. చెరువు శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. ఇందుకోసం పురపాలక శాఖ ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. ప్లాట్లు, అక్రమ వెంచర్లు, లేఔట్లపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు వీలుకల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయాలు అమలు చేసేందుకు మూడు దశల్లో బృందాలు ఏర్పాటు చేశారు. మొదటి దశ(ఎల్–1)లో తహసీల్దార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ అధికారితో కూడిన (ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందం ఉంటుంది. ఎల్–2లో పట్టణ ప్రణాళిక అధికారి (కమిషనర్ సహా), ఎల్–3లో సబ్ కలెక్టర్, కలెక్టరుతో కూడిన కమిటీ ఉంటాయి. కమిషనర్ దశలో తీసుకున్న నిర్ణయాన్ని ఉన్నత స్థాయి అధికారుల అనుమతితో అమలు చేస్తారు. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయం పోర్టల్‌ను పర్యవేక్షిస్తోంది. ఉభయ జిల్లాల్లో అనుమతి లేని నిర్మాణాలు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో పోర్టల్ పద్ధతిని బల్దియాలు సద్వినియోగం చేసుకోవాలి. అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇచ్చేలా పురవాసులను ప్రోత్సహించటంతోపాటు వారికి తగిన భరోసా ఇవ్వాలి. ఇదీ పరిస్థితిఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పురపాలకాల్లో అనుమతుల్లేని నిర్మాణాలు కోకొల్లలు. భద్రాద్రిలోని నాలుగు పురపాలకాల్లో ఇటీవల జోరుగా సాగుతున్నాయి. టీఎస్–బీపాస్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకునే వీలుంది. అయినా కొందరు పట్టించుకోవడం లేదు. నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తూ ఆదాయానికి గండికొడుతున్నారు. శివారు కాలనీల్లో ఈ పరిస్థితి అధికం. అనుమతి లేనికట్టడాలను కూల్చివేసేందుకు బీపాస్‌లో భాగంగా నాలుగు శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశారు. వారు సొంత పనులకే సమయం చాలడం లేదంటున్నారు. చాలామంది అనుమతి తీసుకుని ఆపై నిర్మాణాలు చేపట్టడంలో నిబంధనలు విస్మరిస్తున్నారు. వీరి విషయంలో కచ్చిత పరిశీలన, తగిన సమయం అవసరం. అసలు అనుమతి లేకుండా నిర్మిస్తే మాత్రం నోటీసు



లేకుండానే కూల్చివేయవచ్చు. ఫిర్యాదు విధానం ఇలా.. పట్టణ పరిధిలో ఏదైనా అక్రమ నిర్మాణం, ఆక్రమణ జరిగితే పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారు పూర్తిపేరు, ఈ–మెయిల్ ఐడీ, నిర్మాణం, లేదా ఆక్రమణ జరిగిన ప్రాంతం పేరు, ఫొటోలు జతచేయాలి. 'ఎల్–1' బృందం ఈ ఫిర్యాదును పరిశీలిస్తుంది. చర్యలు తీసుకోదగినదైతే టీపీవోల(ఎల్–2) పరిశీలనకు పంపుతారు. టీపీవోలు వివరాలు పరిశీలించి కమిషనర్‌కు పంపుతారు. నిర్మాణం అక్రమమా? సక్రమమా? ఒకవేళ అక్రమం అయితే జరిమానా విధించాలా? కూల్చివేయాలా అనే నిర్ణయాన్ని తీసుకుంటారు. తిరిగి పరిశీలన, తుది చర్యలు తీసుకోవాలని ఎల్–1కు సిఫార్సు చేస్తారు. ఫిర్యాదును 22 రోజుల వ్యవధిలో పరిష్కరించాలి. ఫిర్యాదుదారు వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అవగాహన పెంపొందిస్తాం– టి.సత్యనారాయణ, పట్టణ ప్రణాళికాధికారి, పాల్వంచత్వరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్ పురపాలకాల్లో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఎల్–1, ఎల్–2లోని టీపీవోలు, ఇతర సిబ్బందికి శిక్షణ ముగిసింది. త్వరలో ఉన్నతస్థాయి అధికారులకు ఈ కార్యక్రమం చేపడతారు. పురపాలకాల ఆదాయాలకు గండికొడుతున్న అక్రమార్కులపై వేగంగా చర్యలు చేపట్టేందుకు ఈ విధానం తోడ్పడుతుంది. ఇందులో ప్రజల బాధ్యతపైనా అవగాహన కల్పిస్తాం.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యం.. 75 మిలియన్ టన్నులు

వరంగల్ : సింగరేణి సంస్థ వచ్చే ఏడాది భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకుంది. కొత్త గనులకు సంబంధించిన ప్రణాళికలకు సైతం రూపకల్పన చేసుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నులు ఉండగా వచ్చే ఏడాది మరో 5 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని పెంచింది. దానికి అనుగుణంగా ఉత్పత్తి చేపట్టేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు చేసుకుంటోంది. ఏ గనుల నుంచి ఎంత బొగ్గు వెలికి తీయాలన్న అంచనాలను తయారు చేసుకుంటోంది. లక్ష్యాన్ని అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటి నుంచే అధికారులకు సూచనలు చేస్తోంది. సంచాలకుల నుంచి కింది స్థాయి అధికారి వరకు వారి వారి గనులు, ప్రాంతాలకు నిర్దేశించిన ఉత్పత్తిని సాధించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. మరి కొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక



సంవత్సరం ప్రారంభం కానుండటంతో అప్పటి లోగా భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది. వచ్చే ఏడాది సింగరేణి సంస్థ 134 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదనంగా సాధించనుంది. ఈ ఏడాది కొత్తగా ప్రారంభించుకున్న గనులు వచ్చే ఆర్థిక సంవత్సరం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆ గనుల నుంచి అదనంగా బొగ్గును వెలికి తీసేందుకు ప్రణాళికలు చేసుకుంది. ఇప్పటికే ప్రారంభించిన జీడీకే కోల్‌మైన్స్(జీడీకే–5) ద్వారా ఉత్పత్తి చేస్తుండగా వచ్చే ఏడాది నుంచి అందులో మరింత ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచుకోనుంది. సింగరేణి సంస్థ ఆపై వచ్చే ఏడాది(2024–25)లో మరో రెండు కొత్త గనులు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి అనుమతులతో పాటు భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసే దిశగా ప్రణాళికలు చేసుకుంది. ఆపై వచ్చే ఏడాదిలో ఎంవీకే ఓసీపీతో పాటు తాడిచెర్ల–2 ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. వీటిద్వారా సింగరేణి సంస్థ అదనంగా మరో 10 మిలియన్ టన్నుల బొగ్గును ఏటా ఉత్పత్తి చేయనుంది.

# ఆర్థిక సంక్షోభంలో కేయూ

వరంగల్ : రాష్ట్రంలో ఉస్మానియా తర్వాత రెండో పెద్ద విశ్వవిద్యాలయం కాకతీయ. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఉపాధ్యాయ విద్య, ఎంసీఏ, ఎంబీఏ, న్యాయశాస్త్ర కోర్సులతో పాటు పరిశోధక రంగంలో 78 కాంబినేషన్‌లలో కోర్సులను అందిస్తోంది. సుమారు 3 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇంతటి కీర్తి కలిగిన కేయూ గత కొన్నేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాక ఉద్యోగుల వేతనాల చెల్లింపు పెద్ద సమస్యగా మారింది. వేతనాలు, పింఛన్లు క్రమం తప్పకుండా చెల్లించడానికే అధికారులు నానా తంటాలు పడుతున్నారు.

నిరాశపరిచిన కేటాయింపులు
2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో నిధులు పెంచుతుందని ఆశతో ఎదురుచూసిన అధికారులకు నిరాశ ఎదురైంది. కేయూ నిర్వహిస్తున్న కళాశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బంది, పెన్షన్‌దారులకు ఏటా రూ.150 కోట్లు అవసరం పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని కేయూ అధికారులు రూ.154 కోట్లు వేతనాల కోసం మరో రూ.200 కోట్లు అభివృద్ధి పనుల కోసమని పతిపాదనలు పంపారు. ప్రభుత్వం కేవలం రూ.127.55 కోట్లు మాత్రమే కేటాయించింది. అభివృద్ధి పనుల కోసం ఎలాంటి నిధులు ఇవ్వలేదు.

వేతనాలకూ.. తిప్పలే
బడ్జెట్‌లో వేతనాలు, పింఛన్‌లకు సరిపడా నిధులు ఇవ్వకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో వెతుకులాట తప్పడం లేదు. ఒకటోతేదీ వచ్చిందంటే నిధులు ఎలా సమకూర్చాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. అంతర్గత వనరులను సేకరించి వేతనాలను చెల్లించాలంటే తలకు మించిన భారం అవుతోందని ఆర్థిక విభాగం అధికారులు వాపోతున్నారు. ప్రతి నెల రూ.12.83 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి. దూరవిద్యా కేంద్రం, పరీక్షల విభాగం, ప్రవేశాల కార్యాలయం, కళాశాలల ప్రిన్సిపాల్ కార్యాలయాల నుంచి అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిధుల లేమితో నెలనెలా వేతనాలు చెల్లించడం ఆలస్యమవుతోంది.

నిలిచిన అభివృద్ధి పనులు
అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఏ వర్సిటీకి ఎన్ని నిధులు ఇస్తారనేది స్పష్టత లేదు. గతంలో కేయూకు 2020–21లో రూ.200 కోట్లు ప్రకటించినా నయాపైసా విడుదల కాలేదు. ఫలితంగా వసతి గృహాల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన, తరగతి గదుల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటులో ప్రగతి లేదు. అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడం పట్ల అధ్యాపక, విద్యార్థి వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఈ నెలలో కేయూకు నాలుగోసారి న్యాక్ బృందం రానుంది. ఇందుకోసం కేయూ ఉన్నతాధికారులు అంతర్గత నిధులు సేకరించి క్యాంపస్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బృందం వచ్చేలోగా క్యాంపస్‌ను సుందరంగా తీర్చిదిద్దడం కోసం చురుకుగా పనులు చేపట్టారు.
ఇదీ పరిస్థితి వేతనాలు, పెన్షన్‌ల కోసం ప్రతినెలా రూ.12.83 కోట్లు అవసరం
ఏడాదికి అవసరమయ్యే నిధులు రూ.150 కోట్లు
రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది: 127.55 కోట్లు
ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు మినహాయించి రూ. 3 కోట్లు అదనంగా అవసరం అవుతున్నాయి. వీటి సర్దుబాటు కోసం విద్యార్థులపై, పరిశోధకులపై ఫీజుల భారం వేస్తున్నారు.



# సిద్ధరామయ్యకు ఆర్థికం.. డీకేకు నీటి పారుదల

బెంగళూరు: కర్ణాటకలో పూర్తి స్థాయి మంత్రి మండలిని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మంత్రులకు శాఖలను కేటాయించింది. ఊహాగానాలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకున్నారు. ఇక పార్టీ ప్రయోజనాల కోసం సీఎం పదవిని త్యాగం చేసి ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టిన డీకే శివకుమార్‌కు నీటిపారుదలతో పాటు, బెంగళూరు నగర అభివృద్ధి శాఖలను అప్పగించారు. ఈ మేరకు మంత్రిత్వ శాఖల కేటాయింపులపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్ణాటక సర్కారు ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. సీఎం సిద్ధరామయ్య ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహించి 13 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా ఆర్థికశాఖను తానే తీసుకున్నారు. దీంతో పాటు కేబినెట్ వ్యవహారాలు, ఇంటెలిజెన్స్, సమాచార, ఐటీ, మౌలికసదుపాయాల అభివృద్ధి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ వంటి శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖ, బెంగళూరు నగర అభివృద్ధి శాఖలను కేటాయించారు. త్వరలో జరగబోయే బృహత్ బెంగళూరు మహానగర పాలిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డీకేకే ఆ శాఖను అప్పగించినట్లు తెలుస్తోంది.

**ఖర్గే కుమారుడికి గ్రామీణాభివృద్ధి.. :** గతంలో హోంశాఖను నిర్వర్తించిన మాజీ ఉపముఖ్యమంత్రి జి.పరమేశ్వరకు ఈసారీ కూడా అదే శాఖ దక్కింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కుమారుడు ప్రియాంక్‌కు గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలను కేటాయించారు. కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఏకైక మహిళా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు మహిళా, శిశు సంక్షేమ శాఖ, వృద్ధులు, దివ్యాంగుల సాధికారిత శాఖలను అప్పగించారు. మాజీ సీఎం బంగారప్ప కుమారుడు మధు బంగారప్పకు ప్రాథమిక, ఉన్నత విద్య శాఖను కేటాయించారు. రామలింగారెడ్డికి రవాణాశాఖను కేటాయించారు. ఈ శాఖపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయగా.. డీకే శివకుమార్ నిన్న ఆయన నివాసానికి వెళ్లి బుజ్జగించడంతో ఆయన అంగీకరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇక దినేశ్ గుండురావుకు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, కృష్ణ బైరెగౌడకు రెవెన్యూ, సతీశ్ జరి?హొళికి ప్రజా వ్యవహారాలు, హెచ్‌సీ మహదేవప్పకు సామాజిక సంక్షేమ శాఖలను అప్పగించారు. మే 20వ తేదీన సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు మరో ఎనిమిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం గత శనివారం మరో 24 మందితో కేబినెట్‌ను విస్తరించారు. దీంతో మొత్తం 34 మందితో పూర్తి స్థాయి మంత్రిమండలి ఏర్పడింది. అయితే, శాఖల కేటాయింపు సవాల్‌గా మారింది.

ఈ నేపథ్యంలోనే మంత్రుల శాఖలకు సంబంధించిన ఓ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అందులో ఉన్న కేటాయింపులపై పలువురు మంత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో అది నిజం కాదని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు.. అసంతృప్తులను బుజ్జగించే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే నిన్న అర్ధరాత్రి దాటాక.. శాఖల కేటాయింపులపై అధికారిక ప్రకటన చేశారు.



# నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 12

శ్రీహరికోట: సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి మరో రాకెట్ ప్రయోగం జరిగింది. ఉదయం 10.42 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్12 వాహకనౌక ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లింది. ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అనంతరం ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. ప్రయోగానికి ముందుగా నిర్వహించే కౌంట్‌డౌన్ ప్రక్రియ ఆదివారం ఉదయం 7.12 గంటలకు ప్రారంభమైంది. ఇది నిరంతరాయంగా 27.30 గంటలపాటు కొనసాగిన తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్12 పొడవు 51.7 మీటర్లు. బరువు 420 టన్నులు. భారతదేశానికి చెందిన రెండో తరం నావిక్ ఉపగ్రహాల్లో ఎన్‌వీఎస్-01 మొదటిది. 2,232 కిలోల బరువున్న దీని జీవితకాలం 12 ఏళ్లు. ఈ ఉపగ్రహం భారత్ ప్రధాన భూభాగం చుట్టూ సుమారు 1500 కి.మీ పరిధిలో రియల్ టైమ్ పొజిషనింగ్ సేవలను అందిస్తుంది. భారతదేశానికి చెందిన రెండో తరం నావిక్ ఉపగ్రహాల్లో ఎన్‌వీఎస్-01 మొదటిది. ఈ ఉపగ్రహానికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ఉపగ్రహంలో రుబిడియం అణుగడియారం ఉంది. ఈ టెక్నాలజీని భారత్ సొంతంగా అభివృద్ధి చేసింది. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో దీనిని నిర్మించారు. ఇటువంటి టెక్నాలజీ అతితక్కువ దేశాల వద్ద మాత్రమే ఉంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పలు ఉపగ్రహాలు అటామిక్ క్లాక్ పనిచేయడం మానేయగానే డేటా పంపడం ఆపేస్తాయి. కచ్చితమైన ట్రాకింగ్‌ను కూడా అందించలేవు. 2018లో కూడా ఇలా పనిచేయని ఉపగ్రహాన్ని మరో శాటిలైట్ పంపి భర్తీ చేశారు. ప్రస్తుతం నాలుగు ఐఆర్ఎన్ఎస్ ఉపగ్రహాలు మాత్రమే లొకేషన్ సర్వీసులను అందిస్తున్నాయి. రెండో తరం నావిక్ ఉపగ్రహాలు ఎల్1 సిగ్నల్స్‌ను పంపగలవు. దీంతో ఉపగ్రహ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థలు మరింత మెరుగ్గా పనిచేసేందుకు సహకరిస్తాయి. ఈ సిగ్నల్స్‌ను అమెరికా అభివృద్ధి చేసిన జీపీఎస్‌లో వినియోగిస్తున్నారు. ఫలితంగా దేశీయంగా అభివృద్ధి చేసిన ప్రాంతీయ నేవిగేషన్ వ్యవస్థలను తక్కువ విద్యుత్తు, సిగ్నల్ ఫ్రీక్వెన్సీ ఉన్న చిప్స్ అమర్చే పరికరాల్లో, పర్సనల్ ట్రాకర్లలో మరింత మెరుగ్గా వినియోగించుకొనే అవకాశం లభించనుంది. రెండో తరం నావిక్ ఉపగ్రహాలు 12 ఏళ్ల పాటు సుదీర్ఘ కాలం సేవలు అందించనున్నాయి. ప్రస్తుతం ఉన్న నావిక్ ఉపగ్రహాలు 10 ఏళ్లపాటు మాత్రమే సేవలు అందించగలవు.



# తొలి వరుసలో జగన్.. సీఎంతో మాట్లాడిన జస్టిస్ పి.కె.మిశ్ర

దిల్లీ: నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో పాల్గొనడానికి దిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవంలోనూ పాలుపంచుకున్నారు. తొలివరుసలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చెంతన ఆశీనులయ్యారు. కొద్దిసేపు హోంమంత్రి అమిత్‌షా పక్కన కూర్చొని మాట్లాడే ప్రయత్నం చేశారు. అమిత్‌షా దగ్గరకు ఎవరో ఒకరు వచ్చి మాట్లాడుతుండడంతో ఆయనతో మాట్లాడే అవకాశం జగన్‌కి పెద్దగా రాలేదు. దాంతో మళ్లీ తన సీట్లోకి వచ్చి కూర్చున్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉంటూ ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ పి.కె.మిశ్ర దూరాన ఉన్న తన సీట్లోంచి లేచి జగన్ వద్దకు వచ్చి కొద్దిసేపు మాట్లాడారు. మాజీ ప్రధానమంత్రి దేవెగౌడ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూర్చున్న చోటుకు జగన్ వెళ్లి నమస్కరించి వచ్చారు. భాజపా సీనియర్ నేతల్లో మురళీమనోహర్ జోషి ఒక్కరే పార్లమెంటు భవన ప్రారంభోత్సవంలో కనిపించారు. కొత్త లోక్‌సభలో ఆరు గ్యాలరీలు ఉండగా అన్నీ దేశ, విదేశీ అతిథులతో నిండిపోయాయి.

# విభజన సమస్యలు పరిష్కరించండి: సీఎం వైఎస్ జగన్

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య విభుజన సమస్యలు పరిష్కరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి ఆయన హోం మంత్రి నివాుసంలో అమిత్ షా తో సుమారు 40 నిమిషాలు భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పటికీ పరిష్కారం కాని పలు అంశాలపై చర్చించారు. పోలవరం ప్రాజెుక్టుకు సంబంధించి సవరించిన అంచనాలకు వీలైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపేలా చూడాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య అపరిుష్కృతంగా ఉన్న అంశాలను వెంటనే పరిష్కురించాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో ఏపీ భవన్ సహా షెడ్యూల్ 9, 10 ఆస్తుల విభజునపై కూడా చర్చించారు. తెలంగాణ ప్రభుుత్వం నుంచి రావాల్సిన విద్యుత్ బకాుయిల అంశాన్నీ హోం మంత్రి దృష్టికి తెచ్చారు. ఏపీ విద్యుత్



సంస్థల ఆర్థిక స్థితిగతులను పరిుగణనలోకి తీసుకుని, వెంటనే ఈ బకాుయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# భర్తకు ఇంట్లోనే దహన సంస్కారాలు

పత్తికొండ పట్టణం: మృతి చెందిన భర్తకు ఇంట్లోనే భార్య దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ సంఘటన కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పత్తికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పోతుగంటి హరికృష్ణ ప్రసాద్ (60), లలిత భార్యాభర్తలు. వీరిద్దరూ మెడికల్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు దినేశ్ కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తుండగా.. చిన్న కుమారుడు కెనడాలో స్థిరపడ్డారు. సోమవారం ఉదయం హరికృష్ణప్రసాద్ ఇంటి నుంచి పొగలు రావడాన్ని గమనించిన కాలనీ వాసులు.. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య లలితతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. తన భర్త అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులకు లలిత తెలిపింది. కుమారులిద్దరూ తమను సరిగా చూసుకోవడం లేదని.. ఆస్తి కోసమే తమ వద్దకు వస్తున్నారని ఆమె తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. తండ్రి చనిపోయిన విషయం తెలిస్తే కుమారులిద్దరూ వచ్చి ఆస్తి కోసం గొడవ చేస్తారని.. ఆ భయంతో తానే భర్తకు అట్టపెట్టెలతో దహన సంస్కారాలు పూర్తిచేసినట్లు తెలిపారు.



# ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం

గువాహటి: అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గువాహటిలోని జలూక్‌బరీ ప్రాంతంలో కారు.. వ్యాను ఢీకొన్నాయి. సోమవారం తెల్లవారుజామున జరిగిన దుర్ఘటనలో ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గువాహటిలోని అస్సాం ఇంజినీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు నిన్న అర్ధరాత్రి దాటాక కాలేజీ ప్రాంగణం నుంచి కారులో బయల్దేరారు. ఈ తెల్లవారుజామున జలూక్‌బరీ ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు డివైడర్‌ను దాటుకుని ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఏడుగురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. అటు పికప్ వ్యాన్‌లో ఉన్న మరో ముగ్గురు కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను గువాహటి మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థులు కారును అద్దెకు తీసుకుని వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగమే ఈ ఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

# గుడ్‌న్యూస్.. ఏపీ సమగ్ర శిక్షా సొసైటీలో 1,358 టీచర్ పోస్టులు



అమరావతి: ఏపీలో పెద్ద సంఖ్యలో టీచింగ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖలోని సమగ్రశిక్షా సొసైటీ నిర్వహించే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. మొత్తం 1358 బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్ట్) భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ (పాఠశాల విద్యాశాఖ) ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన మహిళా అభ్యర్థులు మే 30 నుంచి జూన్ 4 తేదీ రాత్రి 11.59గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

**నోటిఫికేషన్‌లో కొన్ని ముఖ్యాంశాలివే.. మొత్తం ఖాళీలివే..** ప్రిన్సిపాల్ 92 పోస్టులు ఉండగా.. పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్ 846బీ సీఆర్టీ 374, పీఈటీ 46 చొప్పున పోస్టులు ఉన్నాయి. **విద్యార్హతలు..** ఆయా ఉద్యోగాలను బట్టి డిగ్రీ, పీజీ, బీఈడీ, బీపీఈడీలలో ఉత్తీర్ణులై ఉండాలి. **వయో పరిమితి:** జనరల్ అభ్యర్థులకు 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ బీసీలకు అయిదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల చొప్పున వయో సడలింపు ఉంటుంది.

**గౌరవ వేతనం:** ప్రిన్సిపాళ్లకు రూ.34,139బీ సీఆర్టీలకు రూ.26,759బీ పీజీటీలకు రూ.26,759బీ పీఈటీలకు రూ.26,759 చొప్పున నెలకు గౌరవ వేతనం లభిస్తుంది.

**దరఖాస్తు రుసుము:** రూ.100. కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఈ ఉద్యోగాలకు ఎంపిక చేసే విధానం, జిల్లాలు, సబ్జెక్టులు, రోస్టర్ వారీగా ఉద్యోగ ఖాళీలు, విద్యార్హతలు,



‘మహానాడు’లో పాల్గొని రాజమహేంద్రవరం నుంచి బయలుదేరిన తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడిని ఎయిర్‌పోర్టులో గోదావరి జిల్లాల తెదేపా ముఖ్యనేతలు కలిశారు. ఈ సందర్భంగా ‘మహానాడు’ విజయానికి సహకరించిన నేతలకు చంద్రబాబునాయుడు అభినందనలు తెలిపారు.

# ఇంకోక్కటి కావాలట!

బోనీ కపూర్ శ్రీదేవి దంపతుల కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్గా లాంచ్ అయి చాలా కాలమే అయినప్పటికీ... ఆమెకు చెప్పుకోదగ్గ హిట్టు మాత్రం ఒకటి కూడా లేదు. ఒక మరాఠీ సినిమాని బాలీవుడ్లో రీమేక్ చేస్తూ... దాని ద్వారా ఆమెను హీరోయిన్గా ఎంట్రీ ఇప్పించారు. అయితే ఇప్పటివరకు ఆమె తండ్రి చాటు బిడ్డగానే పెరుగుతూ వచ్చింది. అలాంటి ఆమె ఇప్పుడు ఏకంగా ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. టాలీవుడ్లో మొదటి ప్రాజెక్టు... అది కూడా ఎన్టీఆర్ సరసన దక్కడం అనేది మామూలు విషయం కాదనే చెప్పాలి. ఇటీవలే కొరటాల శివ ఎన్టీఆర్ కాంబినేషన్లో ప్రారంభమైన ఈ సినిమా ప్రారంభోత్సవానికి కూడా జాన్వీ కపూర్



కూడా హాజరై సందడి చేసింది. ఇక తెలుగులో మొదటి సినిమానే స్టార్ డైరక్టర్ స్టార్ హీరో సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ 30 సినిమా పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమా విడుదల కానుంది.. యువ సుధ ఆర్ట్స్ ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇక ఈ సినిమా క్లిక్ అయితే జాన్వీ కి అవకాశాలు క్యు కట్టనున్నాయి. ఇక టాలీవుడ్ లో తన రెండో ప్రాజెక్టు గురించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. తెలుగులో తన రెండో సినిమా కోసం బోనీ కపూర్... నిర్మాత దిల్ రాజు ద్వారా ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నట్లు సమాచారం. ఇక జాన్వీ కపూర్ తన రెండో సినిమా యే హీరోతో చేస్తుందో అనే విషయం ఇంకా కన్ఫర్మ్ కాలేదు. కానీ సన్నాహాలు అయితే చేస్తున్నారు. మరొక్క పాన్ ఇండియా సినిమా అయితే... ఇటు తెలుగుతో పాటు... తమిళ కన్నడ మలయాళ హిందీ భాషల్లో కూడా క్రేజ్ వస్తుంది అని ఆలోచిస్తుంది జాన్వీ. పాన్ ఇండియా మూవీ అయితే బెస్ట్ అని జాన్వీ అనుకుంటుంది. మరి అమ్మడిని ఎవరు ఏ హీరో సెలెక్ట్ చేసుకుంటారో చూడాలి ఇక.

# కియరా రెడ్ హాట్ కిల్లర్ లుక్

టాలీవుడ్ బాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా ఓ వెలుగు వెలుగుతోంది కియరా అద్వాణీ. ఇప్పుడు ఆస్కార్ విన్నింగ్ ఆర్.ఆర్.ఆర్ నటుడు.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్ ఛేంజర్'(ఆర్.సి 15) లోను నటిస్తోంది. ఈ సినిమాతో కియరా పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకోనుంది. తనకు తానుగానే గేమ్ ఛేంజర్ గా దూసుకుపోయేందుకు ఇంకెంతో సమయం లేదని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అసాధారణ స్టార్ డమ్ ని ఆస్వాధిస్తూ నేటితరం నాయికల్లో క్రేజీ ఎర్నర్ గా గుర్తింపు తెచ్చుకున్న కియరా ఒక్కో సినిమాకి 3-4 కోట్లు వసూలు చేస్తోంది. హిందీ పరిశ్రమలో పారితోషికం పరంగా మరో మెట్టు పైనే ఉందని తెలిసింది. అలాగే సోషల్ మీడియా పోస్టింగులతోను నిరంతరం బజ్ క్రియేట్ చేస్తున్న కియరా ఈ వేదికలపైనా యాడ్ పోస్టింగులతో భారీగా ఆర్జిస్తోంది. మరోవైపు కియరా నిరంతరం కిల్లర్ హాట్ ఫోటోషూట్లతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. తాజాగా కియరా రెడ్ హాట్ లుక్ ని షేర్ చేయగా అది అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. రెడ్ థై స్లిట్ మఖమల్ డిజైనర్ ఫ్రాకులో కియరా



టూ హాట్ గా కనిపిస్తోంది. నిజానికి థై స్లిట్ ఎలివేషన్ ఇదే తొలిసారి కాదు. కానీ ఈసారి సంథింగ్ స్పెషల్ గా టూహాట్ గా కియరా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ఈ ఫోటోలను జోరుగా వైరల్ చేస్తున్నారు. ఇక ఇటీవలే తన ప్రియుడు సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడేసిన కియరా పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంది? అని ప్రశ్నించగా.. దానికి ఆసక్తికర సమాధానమిచ్చారు. సిద్ధార్థ్ మల్హోత్రా - కియారా అద్వానీ ఇటీవల ముంబైలో జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో తమ చిత్రాలలో అత్యుత్తమ నటనకు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. అనంతరం కియారా అద్వానీని ముంబై విమానాశ్రయంలో ఒక ఫోటోగ్రాఫర్ "మేడమ్ ఆప్ కీ మ్యారేజ్ లైఫ్ కైసీ హై?" అని అడిగారు. కియారా మొదట్లో హాయిగా ఉందనే ఎక్స్ ప్రెషన్ ఇచ్చింది. కెమెరా వైపు తన ముఖాన్ని తిప్పి గేట్ నుండి ప్రవేశించే ముందు "సబ్ సాహీ హై" అని చెప్పింది. షేర్షా-భూల్ భూలైయా 2-జుగ్ జగ్ జియో -గోవింద నామ్ మేరా లాంటి చిత్రాలలో తన నటనకు కియారా స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకోగా.. షేర్షాలో తన పాత్రకు సిద్ధార్థ్ ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నాడు. ఈ జంట షేర్షా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెళ్లి బంధంతో ఒకటయ్యారు. ఇప్పుడు మళ్లీ కెరీర్ పరంగా ఎవరికి వారు బిజీ అయిపోయారు. 2023 ఫిబ్రవరి 7 న జైసల్మేర్ - సూర్యగఢ్ ప్యాలెస్ లో వివాహం జరిగింది.




# ఆ స్టార్ హీరోని పీసీ ఇంకా మర్చిపోలేదా?






గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సీటాడెల్ ప్రమోషన్ లో భాగంగా ఎన్నో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకుం టోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్ సినిమాలపై తనదైన శైలిలో స్పందించి అగ్ని పర్వతంలో మండుతోన్న బాధని లావా రూపంలో బయటకు తెచ్చింది. ఆవెంటనే చన్నీళ్లు చల్లేసి గతం గతహా అనేసింది. దీనిపై రెండు..మూడు రోజులు చర్చ సాగినా తర్వాత అంతా కామ్ అయిపోయారు.

ఈ నేపథ్యంలో తాజాగా ఓ జాకెట్ సీక్రెట్ రివీల్ చేసి మరోసారి మీడియాలో మంట పుట్టించింది. ప్రమోషన్ లో భాగంగా ఓ టీవీ కార్యక్రమానికి హాజరైన పీసీ లెదర్ జాకెట్ లో ప్రత్యక్షమైంది. జాకెట్ బాగుందంటూ యాంకర్ సరదాగా ముచ్చటించింది. దీంతో పీసీ పాత మధుర జ్ఞాపకాల్లోకి జారిపోయింది. ఈ జాకెట్ ఎంతో స్పెషల్. ఇది నా ఎయిర్ పోర్ట్ జాకెట్. నా ఎక్స్ బోయ్ ఫ్రెండ్ ఇచ్చాడు. అతను నా నుంచి వెళ్లిపోయినా ఈ జాకెట్ మాత్రం నాగ్గరే ఉందంది. ఇంకా ఆ బోయ్ ఫ్రెండ్ టచ్ లో ఉన్నాడా? అని ప్రశ్నించగా ఉంటే బాగుండు అనే అర్థం వచ్చేలా స్పందించింది. దీంతో ఆ జాకెట్ స్టోరీ ఏమై ఉంటుందా? అని బాలీవుడ్ మీడియా తవ్వి తీసే ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీనిలో భాగంగా గతంలో షారుక్ ధరించిన నల్లటి జాకెట్ ఫోటోలు వైరల్ అయ్యాయి.

దీంతో పాత కహనీలు మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. షారుక్-ప్రియాంక చోప్రా మధ్య అప్పట్లో రిలేషన్ షిప్ నడిచినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. షారుక్ కారణంగా అతని వైఫ్ గౌరీఖాన్ పీసీకి అవకాశాలు లేకుండా చేస్తున్నారనే వార్తలు హాట్ టాపిక్ గామారినవే. అయితే అప్పటికే పీసీ స్టార్ హీరోయిన్ గా ఎదగడంతో? గౌరీఖాన్ రాజకీయాలు పెద్దగా వర్కౌట్ కాలేదని వినిపించింది. ఇది కొన్ని దశాబ్దాల క్రితం జరిగింది. తాజాగా పీసీ ధరించిన జాకెట్ కారణంగా ఆ విషయాలన్నీ మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. మరి ఆ జాకెట్ నిజంగా షారుక్ ఇచ్చిందా? లేక మరో స్టార్ హీరోతో ఉన్న బాండింగ్ ? అన్నది తెలియాలి. మరి సీటాడెల్ రిలీజ్ అయ్యేలోపు పీసీ ఇంకెన్ని బాంబ్ లు పేల్చుతుందో చూడాలి.

# అల్లరి నరేష్ ఉగ్రం.. ఇలాంటి సాంగ్ ఊహించలేదు




ఒకప్పుడు ఎక్కువగా కామెడీ చిత్రాల్లోనే కనిపించి మెప్పించిన హీరో అల్లరి నరేష్.. సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసినప్పటి నుంచి వినూత్న చిత్రాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆయన హీరోగా నటించిన చిత్రం ఉగ్రం. ఈ చిత్రానికి తూమ్ వెంకట్ కథను అందిస్తుండగా... అబ్బూరి రవి డైలాగ్స్ కూడా రాస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్ పై సాహు గారపాటి హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్లస్ కాబోతున్నాయి. అయితే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన దేవేరి వీడియో సాంగ్ ను ఇటీవలే విజయ్ దేవరకొండ విడుదల చేశారు. అయితే తాజాగా చిత్రబృందం మరో సాంగ్ ను విడుదల చేయబోతోంది. అయితే ఈ సాంగ్ కు సంబంధించి ఓ టీజర్ ను నేడు రిలీజ్ చేసింది. అందులో అల్లరి నరేష్ మిర్ణా మీనన్.. బీచ్ లో చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నారు. ముందు బేబీ ఊహా రెడ్డిని చూపిస్తూ.. ఆ తర్వాత బీచ్ దగ్గర మిర్ణా ఉయ్యాలలో ఊగుతూ కనిపించింది. ఓ వైపు నుంచి అల్లరి నరేష్ స్టైలిష్ గా నడుచుకుంటూ వచ్చి మిర్ణా దగ్గర ఆగుతాడు. వెనకాల బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అదిరిపోయింది. అయితే ఆల్బెల.. ఆల్బెల.. అంటూ సాగే ఈ పాటను ఉదయం 11.07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ పాటను భాస్కర భట్ల రాయగా... రేవంత్ శ్రావణ భార్గవిలు పాటను ఆలపించారు. రేపు రిలీజ్ కాబోయే ఈ పాట కోసం అల్లరి నరేష్ ఫ్యాన్స్ తెగ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ఎలా ఉండబోతోందో అని తెగ ఎగ్జైట్ అవుతున్నారు. ఈ చిత్రానికి సిద్దార్థ్ జె సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తుండగా.. చోటా కే ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ సినిమాను మే 5వ తేదీన విడుదల చేసేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ ఇంద్రజ శరత్ లోహితస్వ శత్రు శ్రీనివాస్ సాయి మణికంత వారణాసి నాగ మహేష్ రమేష్ రెడ్డి బేబీ ఊహా రెడ్డిలు నటిస్తున్నారు.

# ప్రియుడితో ఫోటోలు షేర్ చేసిన హీరోయిన్

హీరో సిద్ధార్థ్ మరియు హీరోయిన్ అదితి రావ్ హైదరి ప్రేమలో ఉన్నారు అనేది గత కొంత కాలంగా జరుగుతున్న చర్చ. ఇప్పటి వరకు వారు అధికారికంగా ప్రకటించలేదు.. కానీ ఇద్దరు షేర్ చేస్తున్న ఫోటోలు మరియు వీడియోలు చూస్తూ ఉంటే.. ఇద్దరు కలిసి వేడుకలకు హాజరు అవ్వడం చూస్తూ ఉంటే ప్రేమలో ఉన్నారనే నమ్మకం రోజు రోజుకు ఎక్కువ అవుతుందని నెటిజన్స్ అంటున్నారు. తాజాగా అదితి రావ్ హైదరి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటో అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రియమైన వారితో అంటూ తాను దిగిన ఫోటోను షేర్ చేయడం ద్వారా మరోసారి సిద్ధార్థ్ తో ప్రేమలో ఉన్నట్లుగా చెప్పకనే చెప్పింది. హీరోయిన్ గా అదితి రావ్ ఈమధ్య



చేస్తున్న సినిమాలు చాలా తక్కువే అయినా కూడా ఈ ప్రేమ వార్తల కారణంగా ఎక్కువ వార్తల్లో నిలిచింది. ఇటీవల టాలీవుడ్ కు చెందిన ఒక స్టార్ యొక్క పెళ్లి వేడుకలో కూడా సందడి చేసిన సిద్దార్థ్ మరియు అదితి రావు హైదరి ల యొక్క జోడీ ఆ సమయంలో కూడా అందరి దృష్టిని ఆకర్షించిన విషయం తెల్సిందే. వీరిద్దరి జోడీ బాగుంటుందని కామెంట్స్ చేస్తున్నారు. మహాసముద్రం సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం మొదలు అయ్యిందని కొందరు కామెంట్స్ చేస్తుంటే.. ముందు నుండే వీరి మధ్య వ్యవహారం సాగుతుంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి వీరిద్దరి ప్రేమ వ్యవహారం గురించి జరుగుతున్న ప్రచారం నిజమే అనే ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# టాప్ లెస్ డ్రెస్ లో థైస్ ఎక్స్ ఫోజ్ చేసి కన్నుల విందు

నాని హీరోగా నటించిన ఆహా కళ్యాణం సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ వాణి కపూర్. తెలుగు లో ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా అయినా కూడా అప్పటి నుండి ఇప్పటి వరకు అమ్మడు సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసినా.. వీడియోలు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి నాని హీరోయిన్ వాణి కపూర్ హాట్ ఫోటో షూట్ షేర్ చేసిన అభిమానులతో పాటు అందరిని కూడా షాక్ అయ్యేలా



చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈ మధ్య కాస్త బిజీగా సినిమాలు చేస్తోంది. ఆకట్టుకునే రూపం ఈ అమ్మడి సొంతం.. అంతే కాకుండా ఫిజిక్ విషయంలో ఈ అమ్మడి తర్వాతే మరెవరైనా అన్నట్లుగా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలకు మోస్ట్ వాంటెడ్ అన్నట్లుగా ఉంటూ.. రొమాంటిక్ సన్నివేశాల్లో ఎలా నటించినా కూడా ఆహా అనిపించే విధంగా ఉండే వాణి కపూర్ ఈ ఫోటోలు చాలా మంది గుండెలకు గుచ్చుకుంటున్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాప్ లెస్ సింగిల్ పీస్ డ్రెస్ లో ఈ అమ్మడు థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చేసిన ఫోటో షూట్ కు సాధారణంగానే అంతా కూడా ఫిదా అవ్వాల్సిందే. అలాంటిది వాణి కపూర్ వంటి అందాల ముద్దుగుమ్మ షేర్ చేస్తే ఇంకా ఏమైనా ఉందా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# రెజ్లర్లపై ఎఫ్ఐఆర్ నమోదు.. ఢిల్లీ పోలీసుల తీరుపై మండిపడ్డ మల్లయోధులు

నూతన పార్లమెంట్ వద్ద నిరసన చేపట్టేందుకు ప్రయత్నించిన భారత రెజ్లర్లపై ఢిల్లీ పోలీసులు పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తమ నిరసనతో 'జాతి ప్రతిష్ఠ'కు భంగం కలిగించారంటూ వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, భజరంగ్ పునియా సహా 12 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్లు 147, 149, 186, 188, 332, 353 కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా, నిరసన తెలుపుతున్న రెజ్లర్లను ఆదివారం అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు అర్ధరాత్రి తర్వాత వారిని విడుదల చేశారు. విడుదలైన తర్వాత ఢిల్లీ పోలీసుల తీరుపై రెజ్లర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై తీవ్రంగా స్పందించారు. 'లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఢిల్లీ పోలీసులకు 7 రోజుల సమయం పట్టింది. అదే శాంతియుతంగా నిరసన చేపట్టిన మాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 7 గంటల సమయం కూడా పట్టలేదు. దేశం నియంతృత్వంలోకి వెళ్లిపోయిందా..? ఈ ప్రభుత్వం ఆటగాళ్ల పట్ల ఎలా వ్యవహరిస్తోందో ప్రపంచం మొత్తం చూస్తోంది' అని వినేశ్ ఫోగట్ ట్వీట్ చేసింది. 'లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి హాజరు కావడం నిజంగా దురదృష్టకరం. ఢిల్లీ పోలీసులకు మాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు కొన్ని గంటల సమయం కూడా పట్టలేదు. కానీ, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేసేందుకు 7 రోజులు (వారం) పట్టింది. మేం తిరిగి ఇంటికెళ్లడం సరైన ఆప్షన్ కాదు. ఇతర రెజ్లర్లను కలిసి.. తర్వాత ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటాం' అని భజరంగ్ పునియా పేర్కొన్నారు. 'నిన్నటి పరిస్థితి చాలా దారుణం. మేము శాంతియుతంగా నిరసన చేయాలనుకున్నాం. కానీ వారు మమ్మల్ని అడ్డుకుని అరెస్ట్ చేశారు. మేము అల్లర్లు చేయలేదు.. ఎలాంటి ప్రజా ఆస్తులను పాడు చేయలేదు' అని సాక్షి మాలిక్ ఆవేదన వ్యక్తం చేశారు.

**జంతర్ మంతర్ వద్ద 144 సెక్షన్ అమలు..** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. నిరసన ప్రాంతానికి మీడియా సహా ఎవరినీ అనుమతించట్లేదు. అక్కడ రెజ్లర్లు ఏర్పాటు చేసుకున్న టెంట్లు, ఇతర సామగ్రిని పోలీసులు తొలగించారు. కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ప్రాంతంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

# తొలిరోజే సెంగోల్ వంగిపోయింది.. రెజ్లర్లపై పోలీసుల తీరును ఖండించిన సీఎం స్టాలిన్



పార్లమెంట్ ప్రారంభోత్సవం తొలిరోజే ప్రతిష్ఠించిన చారిత్రాత్మక సెంగోల్ వంగిపోయిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. సరిగ్గా ప్రారంభోత్సవం రోజే ధర్మానికి ప్రతీక, మన చారిత్రక సంప్రదాయం అపహాస్య పాలైందన్నారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రెజ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై స్టాలిన్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల తీరును సీఎం స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. గత కొన్ని రోజులుగా న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లకు బీజేపీ ప్రభుత్వం ఏమీ చేయలేదని, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ట్విట్టర్ ద్వారా విమర్శించారు. 'శాంతియుతంగా పార్లమెంట్ వెలుపల నిరసన తెలిపేందుకు వచ్చిన రెజ్లర్లను ఈడ్చుకెళ్లి నిర్బంధించడం అనేది ఖండించదగ్గ విషయం. ఈ ఘటనతో ధర్మానికి ప్రతీక అయిన సెంగోల్ మొదటిరోజే వంగిపోయినట్లు అర్థమవుతోంది. రాష్ట్రపతిని పక్కకు తప్పించి, ప్రతిపక్షాల బహిష్కరణల మధ్య కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం రోజున ఇలాంటి దారుణం జరగడం న్యాయమేనా?' అని స్టాలిన్ ట్విట్టర్ వేదికగా కేంద్రాన్ని నిలదీశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా టాప్ రెజ్లర్లు నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరి ఆందోళనకు బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో.. రెజ్లర్లు ఆదివారం కొత్త పార్లమెంటు భవనం వైపు ర్యాలీగా వెళ్తుండగా ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియాతో పాటు ఇతర ఆందోళనకారులను నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలించి, రెజ్లర్లపైనే కేసులు నమోదుచేశారు.

# రెజ్లర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా..? ప్రశ్నించిన మంత్రి కేటీఆర్



జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మంత్రి కేటీఆర్ మద్దతు ప్రకటించారు. రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల తీరును కేటీఆర్ ఖండించారు. అంతర్జాతీయ వేదికపై దేశ ఖ్యాతిని చాటిన రెజ్లర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రెజ్లర్లకు దేశ ప్రజలు మద్దతుగా నిలవాలి. వారికి మనందరం గౌరవం ఇవ్వాలని కేటీఆర్ కోరారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ ఆదివారం రణరంగమైన విషయం తెలిసిందే. నెల రోజులకు పైగా ఆందోళనలు కొనసాగిస్తున్న రెజ్లర్ల పట్ల కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ పోలీసులు, ప్రత్యేక బలగాలు కర్కశంగా ప్రవర్తించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేయాలన్న డిమాండ్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టడానికి నిరసనగా ఆదివారం కొత్త పార్లమెంట్ భవనం వద్ద 'మహిళా సమ్మాన్ మహాపంచాయత్' నిర్వహించ తలపెట్టారు. ఇందులో భాగంగా కొత్త పార్లమెంట్‌కు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన రెజ్లర్లను పోలీసులు నిర్బంధించారు.

దీంతో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియాతో పాటు ఇతర ఆందోళనకారులను నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలించి, రెజ్లర్లపైనే కేసులు నమోదుచేశారు. నిందితుడ్ని ప్రభుత్వం రక్షిస్తున్నదని వినేశ్ ఫోగట్ ఆక్షేపించారు.

# ఈ జిల్లాల్లో నేడు వడగండ్ల వాన..! ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ..!



రాగల నాలుగు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొంది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఉదయం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ వడగండ్లు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం పలుచోట్ల పొడివాతావరణం ఏర్పడే సూచనలున్నాయని, పలుప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు పడుతాయని చెప్పింది. బుధవారం నుంచి శనివారం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం వికారాబాద్, హైదరాబాద్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైంది.

# చదువుకు తగ్గ జాబ్ లభించినప్పుడే విద్యార్థులకు గౌరవం : మంత్రి తలసాని

హైదరాబాద్ : మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివించిన తల్లిదండ్రులకు, ఎంతో కష్టపడి మీరు చదివిన చదువుకు తగిన జాబ్ లభించినప్పుడే విద్యార్థులకు, తల్లిదండ్రులకు గౌరవం, తృప్తి కలుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని మెథడిస్ట్ ఇంజినీరింగ్ కాలేజీలో అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల వద్దకే వచ్చి ప్రముఖ సంస్థలు, కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించే జాబ్ మేళా ఒక గొప్ప అవకాశమని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా కళాశాలల్లోనే జాబ్ మేళాలు నిర్వహించి పలు సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్న అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులను మంత్రి ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వస్తుందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే 1.35 లక్షల ఉద్యోగాల భర్తీ జరగగా, మరో 90 వేల ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌లను విడుదల చేస్తుందని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అభివృద్ధి పనుల ఫలితంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద సంస్థలు ముందుకొస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అనువైన పరిస్థితులు ఉండటం, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో పెద్ద ఎత్తున వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, లక్షలాది మందికి వాటిల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా జాబ్ మేళాకు వచ్చిన వివిధ సంస్థల ప్రతినిధులకు మంత్రి సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మినేని మధు, లోహిత్ కుమార్, అపోలో హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేందర్ రెడ్డి, మెథడిస్ట్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రభు, వివిధ సంస్థల ప్రతినిధులు సూర్య చంద్రారెడ్డి, రాకేశ్ రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



# లింగ నిర్ధరణ చేసి గర్భస్రావాలు

వరంగల్: లింగనిర్ధరణ ద్వారా గర్భస్రావాలు చేస్తున్న 18 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట కేంద్రం గా జరుగుతున్న ఈ వ్యవహారంపై సీపీ రంగనాథ్ వివరాలను వెల్లడిం చారు. నిందితుల నుంచి 18 సెల్‌ఫోన్లు, రూ.73వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. "నర్సంపేట కేంద్రంగా పెద్ద ఎత్తున లింగనిర్ధరణ పరీక్షల దందా సాగుతోంది. లోటస్ ఆస్పత్రి యజమాని, వైద్యులను అరెస్టు చేశాం. స్కానింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం. ఆయుర్వేద వైద్యులు కూడా గర్భస్రావాలు చేస్తున్నారు. బాధ్యులైన వైద్యులు, సిబ్బంది అందరినీ పట్టుకున్నాం. ఈ విషయంపై వైద్యశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం" అని సీపీ రంగనాథ్ చెప్పారు.

**ఒక్కొక్కరి నుంచి రూ.30వేల నుంచి రూ.50వేలు వసూలు :** నర్సంపేటకు చెందిన ప్రముఖ మహిళా వైద్యురాలు, నెక్కొండకు చెందిన ఒక వైద్యుడితోపాటు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు, ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో పలు విషయాలు వెలుగు చూశాయి. నర్సంపేట, నెక్కొండ, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాల్లో గర్భస్రావాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భిణులను లింగనిర్ధరణ పరీక్షల కోసం నగరానికి తీసుకొస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సుమారు 200 మందికి అబార్షన్లు చేయించి ఉంటారని.. ఈ మేరకు విచారణలో వెల్లడైందని తెలిపారు.

# హజ్ యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు.. జూన్ 5 నుంచి చార్టర్డ్ విమానాలు: మంత్రి కొప్పుల



హైదరాబాద్: హజ్ యాత్రికులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని హజ్ కమిటీ భవనంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హజ్ యాత్ర ఏర్పాట్లపై సమీక్షించారు. ఎయిర్ పోర్టు, రవాణా, పోలీసులు, జీహెచ్ఎంసీ, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది హజ్ వెళ్లే యాత్రికులకు ప్రభుత్వం అన్ని వసతులు సమకూర్చినట్టు మంత్రి చెప్పారు. హైదరాబాద్ హజ్ హౌస్‌లో అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చినట్లు పేర్కొన్నారు. "యాత్రికుల వసతి, బస, విమానాల టికెట్ బుకింగ్, బోర్డింగ్ సౌకర్యాల విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్ హజ్‌హౌస్‌లో పాసులు, సామాను స్క్రీనింగ్, చెక్ ఇన్, మెడికల్, టీకా వంటివి ఏర్పాటు చేస్తున్నాం. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రత్యేక టెర్మినల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఏటా దాదాపు 7 వేల మంది హైదరాబాద్ నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్నారు. వారికోసం జూన్ 5 నుంచి హజ్ చార్టర్డ్ విమానాలు నడుపుతాం. యాత్రికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని మంత్రి సూచించారు.

# ఆ సమయంలో కేసీఆర్ గారు ఎందుకు గెలవలేదో...!



హైదరాబాద్ : 1983 ఎన్నికల్లో కేసీఆర్ ఓటమి పాలైన విషయాన్ని మరోసారి బీజేపీ నాయకురాలు విజయశాంతి గుర్తు చేశారు. ఆ సమయంలో టీడీపీ ప్రభంజనం నడుస్తోందని.. అలాంటి తరుణంలో కేసీఆర్ ఎందుకు గెలవలేదో చెప్పాలన్నారు. నేడు ఆమె ఫేస్‌బుక్ వేదికగా సీఎం కేసీఆర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. "నిన్నటి ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చినట్లు ఎన్టీఆర్ గారి ప్రచారం లేక కేసీఆర్ గారు 1983లో ఓడిపోయినట్లు చెప్పుకునేది వారి నాటి ఎన్నికల పరిస్థితి నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం. ఎన్టీఆర్ గారు ప్రచారం చెయ్యలేని చాలామంది టీడీపీ అభ్యర్థులు కూడా రాష్ట్రంలో గెలిచినప్పుడు, 1983 ఎన్నికలలో టీడీపీ ప్రభంజనంలో కూడా కేసీఆర్ గారు ఎందుకు గెలవలేదో... ఒక ఓటు, రెండు రాష్ట్రాలు అన్న నినాదంతో ఉన్న బీజేపీ వాదిగా... తెలంగాణను వ్యతిరేకిస్తున్నటీడీపీ అభ్యర్థులకు ప్రచారం చెయ్యనంటున్న నన్ను కేసీఆర్ గారి 1999 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధిపేటలో నా ప్రచారానికి, ఎంతో అభ్యర్థించినది కూడా ఆ 1983 భయంతోనే కావచ్చు... లేదా ముందు కొన్ని ఎన్నికలలో గెలిచినా, అప్పటికి ప్రజా వ్యతిరేకత ఎక్కువ ఉన్నదనే భయం కావచ్చు. సరే, ప్రచారం చేశాను, కేసీఆర్ గారు గెలిచారు. వారికి అది గుర్తు ఉండదు. మతిమరుపుకు సమాధానం సహజంగా ఉండదు, అందునా సిచ్యుయేషనల్ అమ్నీషియా గురించి ఎవ్వరూ చెప్పలేరు. దళిత సీఎం , డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు 3 ఎకరాల భూమి, సీఎం గారు స్వయంగా దత్తత తీసుకున్న గ్రామాలు, ఇస్తాంబుల్, న్యూయార్క్ లెక్క అభివృద్ధి, కేజీ టూ పీజీ ఉచిత విద్య, 3 వేల రూపాయల నిరుద్యోగభృతి ఇట్లా ఎన్నో... గుర్తులేకపోవడం సీఎం గారి అవకాశవాదం. జ్ఞాపకం లేకపోవడం తెలంగాణ ప్రజల మరో తప్పిదం మాత్రం కారాదు" అని విజయశాంతి పేర్కొన్నారు.

# అందుకే ఇందిరాగాంధీ "గరీబీ హటావో" నినాదాన్ని అమలు చేస్తున్నాం



హైదరాబాద్: ఇందిరాగాంధీ "గరీబీ హటావో" నినాదాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన, విజయాలపై సోమవారం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ... టాయిలెట్ల నిర్మాణం, రేషన్, ఇండ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. గతంలో రూపాయి పంపిస్తే లబ్దిదారులకు 15 పైసలే అందేవని..అవినీతి జరుగుతోందని రాజీవ్ గాంధీ స్వయంగా అంగీకరించారని గుర్తుచేశారు. అందుకే డీబీటీ విధానంతో అవినీతికి తావులేకుండా లబ్దిదారుడికి మోదీ ప్రభుత్వం అందజేస్తోందన్నారు. "మహాజన్ సంపర్క్ అభియాన్" పేరుతో దేశ ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకు ప్రజల్లోకి వెళుతున్నామని ఆయన చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఎన్నికల తరువాత అభివృద్ధే మోదీ లక్ష్యమని స్పష్టం చేశారు. గత పాలనలోని మంచి కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత మోదీదే అని చెప్పుకొచ్చారు. గతంలో ఇందిరాగాంధీ హయాంలో "గరీబీ హటావో" నినాదం మంచిదే అని.. ఆ పథకాన్ని ఎందుకు అమలు చేయలేకపోయారో తెలుసుకుని... మంచి ఉద్దేశంతో టాయిలెట్ల నిర్మాణం, రేషన్ బియ్యం అందజేత సహా పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కేంద్ర పథకాల విషయంలో రూపాయి పేద వాడికి పంపిస్తే.. 15 పైసలే అందుతున్నాయని రాజీవ్ గాంధీ చెప్పారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని డీబీటీ విధానంతో లబ్దిదారుడికి మోదీ నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.

# సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయండి: జేఎన్‌జేహెచ్ఎస్

హైదరాబాద్: తమ సొసైటీకి కేటాయించిన భూమి ని వెంటనే అప్పగించాలని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ మహిళా సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాల తమ కలను నెరవేర్చాలని వేడుకున్నారు. సోమవారం హైదరాబాద్, సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లోని మహిళా సభ్యులు, మృతి చెందిన సభ్యుల కుటుంబాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కోవిడ్ తర్వాత సభ్యుల్లో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయి రిటైరైనవారు కూడా కనీసం పీఎఫ్, పెన్షన్ వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. 2011లోనే ప్రభుత్వానికి సొసైటి డబ్బులు చెల్లించినా.. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. ఇంతవరకు స్థలం స్వాధీనం చేయలేదు. ఏళ్ల తరబడి ఎదురు చూసి నిరాశ నిస్పృహలతోనే కొంతమంది సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ పెద్దలను కోల్పోయి దిక్కుతోచని దుర్భరస్థితిలో కొందరుంటూ.. కోవిడ్ అనంతరం చాలా మంది ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని పెండింగ్‌లో ఉన్న పేట్ బషీరాబాద్ స్థలాన్ని సీఎం కేసీఆర్ తమ సొసైటీకి స్వాధీనం చేయాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. మృతి చెందిన సభ్యుడు ఉమేష్ భార్య రాధిక, షరీఫ్ కుమారుడు మసూద్ షరీఫ్ తదితరులు తాము పడ్డ ఇబ్బందులు, ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులను వివరించారు. సమావేశంలో పాల్గొన్న మహిళా సభ్యులంతా తమ భూ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. సొసైటీ సీఈవో వంశీ శ్రీనివాస్ సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కాగా ఇప్పటి వరకు సొసైటీలో 60 మంది జర్నలిస్టులు మృతి చెందారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com